

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | శనివారం 29-03-2025 | సంపుటి - 22 | సంచిక - 335 రూ : 4 | పేజీలు: 8




## భానుడి భగభగలు

- 181 ప్రాంతాల్లో 40 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు

విశాఖపట్నం: రాష్ట్రంలో భానుడు నిప్పులు కురిపిస్తున్నాడు. వేడి గాలుల ప్రభావంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శుక్రవారం ప్రకాశం జిల్లా తాటిచెర్ల, వైఎస్సార్ జిల్లా కమలాపురంలో 42.6, నంద్యాల జిల్లా ఆలమూరులో 42.5, తిరుపతి జిల్లా వెంకటగిరిలో 42.2, అనకాపల్లి జిల్లా రావికమతంలో 42.1 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. తరువాయి 2లో

## డిగ్రీలో ప్రతి సెమిస్టర్‌కూ ఓ టెక్నాలజీ సబ్జెక్టు!



- బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల్లో పక్కాగా అమలు
- చివరి ఏడాది రెండు ఇంటర్న్‌షిప్‌లు
- సిలబస్ మార్పుపై కసరత్తు కొలిక్కి

హైదరాబాద్: ''తెలంగాణలో విద్యార్థులు డిగ్రీ పూర్తి చేస్తే... ఆ పట్టాతో జాబ్ మార్కెట్‌లో ఉద్యోగం పొందాలి. లేదంటే కేంద్ర తరువాయి 2లో




## ఇక్కడి బస్సు.. అక్కడ రిజిస్ట్రేషన్

- పన్ను తక్కువ కావడంతో.. ట్రావెల్స్ బస్సులు అటువైపు మొగ్గు
- ఆ రాష్ట్రాల్లో 1,369 ఏపీ బస్సుల రిజిస్ట్రేషన్
- ఏటా 100 కొత్త బస్సులకు అక్కడే
- రాష్ట్రానికి ఏటా రూ.82 కోట్ల నష్టం 2లో

## రాష్ట్రానికి రూ.259 కోట్ల అదనపు నిధులివ్వండి

- కేంద్ర మంత్రి నిర్మలకు మంత్రి సత్యకుమార్ వినతి



దిల్లీ: జాతీయ ఆరోగ్య మిషన్, ఇతర పథకాల కింద రాష్ట్రానికి రూ.259 కోట్ల అదనపు నిధులు కేటాయించాలని ఏపీ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కోరారు. ఆయన శుక్రవారం ఇక్కడ కేంద్ర మంత్రిని కలిసి ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. బడ్జెట్ చివరలో వైద్యఆరోగ్య శాఖకు పునఃకేటాయింపులు చేసే సమయంలో ఎన్‌హెచ్‌ఎం కింద రూ.109 కోట్లు, పనితీరు ప్రోత్సాహకం కింద రూ.150 కోట్లు రాష్ట్రానికి విడుదల చేయాలని కోరారు. తరువాత ఆయన కేంద్ర పర్యాటక మంత్రి గజేంద్రసింగ్ షెకావత్, అణుశక్తి మంత్రి జితేంద్రసింగ్‌లతో సమావేశమై రాష్ట్రంలో మెడికల్ టూరిజం, క్యాన్సర్ చికిత్సల విషయంలో సహకరించాలని విన్నవించారు.



## అపార్ట్‌మెంట్లే అచ్చొస్తున్నాయి

- ఫ్లాట్ల విక్రయాలతో రిజిస్ట్రేషన్ల శాఖకు 35% ఆదాయం
- స్థలాల లావాదేవీలతో చేకూరేది 23%
- వ్యవసాయ భూములతో 11.5% వస్తున్నట్లు అంచనా
- సాగు భూముల మార్కెట్ విలువ తక్కువగా ఉండటమే కారణమని విశ్లేషణ

స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ద్వారా ప్రభుత్వ ఖజానాకు అపార్ట్‌మెంట్లు, ఫ్లాట్ల విక్రయాలతో ఎక్కువ ఆదాయం వస్తోంది. 202425 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన మొత్తం రాబడుల్లో ఇది 35% కావడం గమనార్హం. ఈమేరకు వచ్చే ఏడాది మరింత ఆదాయం సాధించాలన్న సంకల్పంతో ప్రభుత్వం అడుగులు వేస్తోంది. స్థిరాస్తి మార్కెట్‌లో కొంత స్తబ్ధత ఉన్నప్పటికీ సాలీనా రూ.14,588 కోట్ల రాబడి నమోదవుతుందనే అంచనాలు తరువాయి 2లో

## పునాది పూర్తయిన ఇళ్లకు తక్షణమే చెల్లింపులు



- జూన్ ఆఖరుకు వరంగల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ పూర్తి
- గ్రామాల్లో తాగునీటి సమస్యలు రావద్దు
- ఉమ్మడి వరంగల్ జిల్లా సమీక్షలో మంత్రి పొంగులేటి

హైదరాబాద్: పైలట్ గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల గ్రౌండింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని, పునాది వరకు పూర్తయిన ఇళ్లకు వెంటనే చెల్లింపులు చేయాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, వరంగల్ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. మంత్రులు సీతక్క, కొండా సురేఖ, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డితో కలిసి ఉమ్మడి వరంగల్ జిల్లాలో అభివృద్ధి పనులపై శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ... ''రాష్ట్ర ప్రభుత్వానికి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం అత్యంత ప్రాధాన్యాంశం. దీన్ని దృష్టిలో పెట్టుకొని జిల్లాల కలెక్టర్లు పనిచేయాలి. పునాది స్థాయికి చేరిన ఇళ్ల వివరాలను గృహనిర్మాణ శాఖకు పంపిస్తే తక్షణమే రూ.లక్ష చెల్లిస్తాం. ఇందిరమ్మ ఇళ్లకు అర్హత తరువాయి 2లో


## సన్నబియ్యం పంపిణీ.. తెలంగాణలోనే ప్రథమం

* 84 శాతం మంది పేదలకు లబ్ధి
* త్వరలో ఉప్పు, పప్పు, చింతపండు కూడా
* మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

హైదరాబాద్: దేశంలో సన్నబియ్యం పంపిణీ చేస్తున్న తొలి రాష్ట్రంగా తెలంగాణ... చరిత్రలో నిలవబోతోందని పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు.

తరువాయి 2లో





## థాయ్‌లాండ్, మయన్మార్‌లలో భూ విలయం

* రెండు దేశాల్లో 150 మందికి పైగా మృతి
* 750 మందికి పైగా గాయాలు
* 12 నిమిషాల వ్యవధిలో రెండు భారీ భూకంపాలు
* బ్యాంకాక్‌లో కుప్పకూలిన 33 అంతస్తుల భవనం.. శిథిలాల కింద 100 మందికి పైగా!
* మయన్మార్‌లో వెయ్యి పడకల కొత్త ఆసుపత్రి నేలమట్టం

2లో

## అమరావతిలో... క్వాంటమ్ వ్యాలీ

- ఐబీఎం సహకారంతో ఏర్పాటు
- అత్యాధునిక సాంకేతికతను రాజధానికి తీసుకొస్తాం
- స్టార్టప్ ఆలోచనలుంటే రాష్ట్రానికి ఆహ్వానం
- ఐఐటీ మద్రాస్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగం

2లో



# డిగ్రీలో ప్రతి సెమిస్టర్‌కూ ఓ టెక్నాలజీ సబ్జెక్టు!

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్ర ప్రభుత్వాలు, బ్యాంకింగ్ రంగాల్లో పోటీ పరీక్షలకు ఎటువంటి ప్రత్యేక కోచింగ్ లేకుండా పోటీపడాలి. ఇవీకాదంటే వారే సొంతంగా స్వయం ఉపాధి చూసుకునేలా తయారవ్వాలన్నదే మా లక్ష్యం'' అని ఉన్నత విద్యామండలి స్పష్టంచేస్తోంది. తదనుగుణంగా రెండు నెలలుగా సిలబస్‌లో మార్పులు, చేర్పులపై కసరత్తు చేస్తోంది. తమ ప్రయత్నం దాదాపు కొలిక్కి వచ్చిందని సంబంధిత ఉన్నతాధికారులు వెల్లడించారు. ఈ మేరకు డిగ్రీలో బీఎస్సీ, బీకాంలతోపాటు బీఏ కోర్సులోనూ వినూత్న మార్పులకు శ్రీకారం చుడుతున్నారు. ప్రతి సెమిస్టర్‌లో ఒక టెక్నాలజీ సబ్జెక్టును ఒక తప్పనిసరి పేపర్‌గా ప్రవేశపెట్టనున్నారు. డిగ్రీ మూడేళ్ల కోర్సుకు మొత్తం 120 క్రెడిట్లు, నాలుగేళ్ల ఆనర్స్ కోర్సుకు 160 క్రెడిట్లు ఇవ్వనున్నారు.

*** ఆరు టెక్నాలజీ పేపర్లు... రెండు ఇంటర్న్‌షిప్‌లు**

''టెక్నాలజీపై అవగాహన లేకుంటే ప్రస్తుత పరిస్థితుల్లో కెరీర్‌లో రాణించడం కష్టం. అలాంటి యువతకు ఉద్యోగావకాశాలు కూడా తగ్గుతాయి. అందుకే పరిశ్రమలకు తగినట్లు విద్యార్థులను తీర్చిదిద్దాలి. బీఏలాంటి కోర్సులు చేస్తున్న వారు సైతం చదువు పూర్తయ్యేలోపు ఉద్యోగ నైపుణ్యాలతో బయటకు వెళ్లాలి'' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తరచూ చెబుతున్నారు. ఈమేరకు మూడేళ్ల డిగ్రీలో సెమిస్టర్‌కు ఒకటి చొప్పున సాంకేతికతకు సంబంధించిన పేపర్‌ను ప్రవేశపెడుతున్నారు. ఉదాహరణకు బీఏ ఆర్థికశాస్త్రం మొదటి సెమిస్టర్‌లో బేసిక్ కంప్యూటర్ స్కిల్స్, రెండో సెమిస్టర్‌లో డేటా అనాలసిస్, మూడో సెమిస్టర్‌లో ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అండ్ డెవలప్‌మెంట్, నాలుగులో డిజిటల్ లిటరసీ, ఐదులో ఫండమెంటల్ ఆఫ్ ఏఐ టూల్స్ అండ్ టెక్నాలజీ, ఆరో సెమిస్టర్‌లో ఇంట్రడక్షన్ టూ సైబర్ క్రైమ్స్ అనే పేపర్లు ఉంటాయి. ఒక్కో దానికి మూడు క్రెడిట్లు కేటాయిస్తారు. ఇక ఐదు, ఆరు సెమిస్టర్లలో ఇంటర్న్‌షిప్‌లు తప్పనిసరి. ఒక్కో దానికి రెండు క్రెడిట్లు ఇస్తారు. జాతీయ నూతన విద్యా విధానాన్ని దృష్టిలో ఉంచుకొని ఈ విద్యా ప్రణాళికను రూపొందిస్తున్నారు.

*** కమ్యూనికేషన్ ఇంగ్లిష్‌పై దృష్టి**

ఆంగ్లం అంటే ఇప్పటివరకు కొందరు ప్రముఖ రచయితల పాఠాలు, కవిత్వం లాంటి వాటికి ప్రాధాన్యమిస్తూ వచ్చారు. ఇకపై ప్రథమ భాషగా ఆంగ్లమే ఉన్నా కమ్యూనికేషన్ ఇంగ్లిష్‌కు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. తొలి సెమిస్టర్‌లో ప్రథమ భాషగా ఇంగ్లిష్ కమ్యూనికేషన్, రెండో సెమిస్టర్‌లో క్రిటికల్ థింకింగ్ అండ్ రీజనింగ్, మూడో సెమిస్టర్‌లో బిజినెస్ కమ్యూనికేషన్ పేరిట ఆంగ్లం సబ్జెక్టు ఉంటుంది. బీకాంలోనూ అదేమాదిరిగా టెక్నాలజీ పేపర్లు ఉండనున్నాయి. బీఎస్సీ గణితం లాంటి వాటిల్లో మెంటల్ ఎబిలిటీ, రీజనింగ్, అర్థమేటిక్ లాంటి వాటిని సైతం చేరుస్తున్నారు. రానున్న విద్యా సంవత్సరాన్ని (2025 26) ఈసారి త్వరగా ప్రారంభించాలని భావిస్తున్న ఉన్నత విద్యామండలి... అతిత్వరలో సిలబస్‌ను ఖరారు చేసి, విశ్వవిద్యాలయాల ఆమోదం కోసం పంపనుంది. ఆ తర్వాత తెలుగు అకాడమీ పుస్తకాలను ముద్రించనుంది.

# పునాది పూర్తయిన ఇళ్లకు తక్షణమే చెల్లింపులు

(మొదటిపేజీ తరువాయి)

కలిగిన లబ్ధిదారుల్లో స్థలాలు లేని వారికి... ఖాళీగా ఉన్న రెండు పడక గదుల ఇళ్లను కేటాయించాలి. మొండి గోడలతో ఉన్న ఇళ్లను పూర్తి చేయడానికి గుత్తేదారు ముందుకురాకుంటే లబ్ధిదారులే పూర్తి చేసుకోవడానికి అవసరమైన ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వమే చెల్లిస్తుంది. రానున్న మూడు నెలలు చాలా కీలకం. గ్రామాలు, పట్టణాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా కలెక్టర్లు అప్రమత్తం కావాలి. అధికారులతో సమన్వయం చేసుకొని వారంలో మూడు రోజులు గ్రామాల్లో పర్యటించాలి. నీటికొరత ఉంటే ట్యాంకర్లతో సరఫరా చేయాలి. చెడిపోయిన బోర్లు, చేతిపంపులను తక్షణమే మరమ్మతు చేయించాలి.

*** ఉత్తర తెలంగాణకు అత్యాధునిక వైద్యం**

వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణాన్ని రెండు నెలల్లో పూర్తి చేసి, జూన్ చివరినాటికి అన్ని వసతులు కల్పించాలి. ఇక్కడ సేవలు ప్రారంభమైతే ఉత్తర తెలంగాణ ప్రజలకు అత్యాధునిక వైద్యం అందుబాటులోకి వస్తుంది. మడికొండలో డంపింగ్ యార్డు సమస్యకు వారం రోజుల్లో తాత్కాలిక పరిష్కారం చూపాలి. తర్వాత పురపాలక శాఖ కమిషనర్ డైరెక్టర్ శ్రీదేవి శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి. వరంగల్, కరీంనగర్ రహదారి ప్రాంతంలో శాశ్వత డంపింగ్ యార్డుకు 150200 ఎకరాల వరకు భూసేకరణ చేయాలి. వరంగల్ భద్రకాళి చెరువు పూడికతీతను వర్షాకాలంలోపు పూర్తి చేయాలి. వరంగల్ స్మార్ట్ సిటీ పనుల విషయంలో అధికారులు ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలి. సమావేశంలో ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాయని రాజేందర్, యశస్వినీరెడ్డి, దొంతి మాధవరెడ్డి, నాగరాజు, మురళీనాయక్, రామచంద్రునాయక్, రేవూరి ప్రకాష్‌రెడ్డి, గండ్ర సత్యనారాయణ, వరంగల్ మేయర్ గుండు సుధారాణి, మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్ తదితరులు పాల్గొన్నారు.

# అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ



చెన్నై : 'సిలికాన్ వ్యాలీ తరహాలో త్వరలో అమరావతి కేంద్రంగా క్వాంటమ్ వ్యాలీ రాబోతోంది. ఐఐటీ మద్రాస్‌తో కలిసి దీన్ని సాధ్యం చేసే పనిలో ఉన్నాం. క్వాంటమ్ టవర్‌ను నిర్మించడంతో పాటు భవిష్యత్తుకు అవసరమైన అన్ని అత్యాధునిక సాంకేతికతలు అందులో ప్రదర్శనకు ఉంచుతాం. ఈ వ్యాలీని దేశానికి కానుకగా ఇవ్వబోతున్నాం' అని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించారు. ఐఐటీ మద్రాస్‌లో జరుగుతున్న ఆల్ ఇండియా రీసెర్చ్ స్కాలర్స్ సమ్మిట్ 2025లో శుక్రవారం ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని, యువ పరిశోధకుల్ని ఉద్దేశించి ప్రసంగించారు. అమరావతి క్వాంటమ్ వ్యాలీ ప్రాజెక్టుకు ఐఐటీ మద్రాస్ డైరెక్టర్ ప్రొఫెసర్ కామకోటి, బృందం కీలకం కాబోతున్నట్లు వెల్లడించారు. వారితో పాటు ఐబీఎం, టీసీఎస్, ఎల్అండ్‌టీ, కేంద్ర ప్రభుత్వం తదితరులతో కలిసి పనిచేస్తున్నామన్నారు. క్వాంటమ్ కంప్యూటింగ్ సాంకేతికతతో పాటు అందరి జీవితాలకు పనికొచ్చే డీప్ టెక్నాలజీల్ని కూడా ప్రవేశపెడుతున్నట్లు వివరించారు. 1995లో ఐటీ ఎలా మొదలుపెట్టానో, 2025లో ఏఐ గురించి అలాగే ఆలోచిస్తున్నానని చెప్పారు. ఏపీకి వచ్చేందుకు గూగుల్ సుముఖత తెలిపిందని, డాటా సెంటర్‌ను పెడుతున్నట్లు వివరించారు. విశాఖ నుంచి సింగపూర్ దాకా సముద్రగర్భంలో సీ కేబుల్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. పెళ్లి.. ఉద్యోగం.. పిల్లలు 'పెళ్లి చేసుకుని, భార్యాభర్తలిద్దరం ఉద్యోగాలు చేసుకుందాం, పిల్లలొద్దు అనుకోవద్దు. అలాగైతే జనాభా భారీగా తగ్గిపోతుంది. జనాభాను సరైన ప్రకారం పెంచితే రాబోయే 500 సంవత్సరాలు భారతీయులే ప్రపంచాన్ని శాసించే స్థితికి వస్తాం' అని చంద్రబాబు అన్నారు. 25 ఏళ్ల కిందట జనాభా నియంత్రణ నినాదం తీసుకోవడంతో ఇప్పుడు దక్షిణ భారతదేశంలో సంతానోత్పత్తి రేటు తగ్గిందన్నారు. ఒకప్పుడు జనాభా పెద్ద సమస్యగా ఉండేదని, ఇప్పుడు అదే అతిపెద్ద లాభంగా మారుతోందని గుర్తుచేశారు. 'పద్ధతి ప్రకారం జనాభా పెంచుకుని 20 కోట్ల మంది భారతీయులు 150 దేశాల్లో విస్తరిస్తే.. ఆర్థిక వ్యవస్థ ఎలా మారుతుందో ఊహించుకోండి. ఒకప్పుడు మనల్ని వద్దన్న జపాన్, జర్మనీలు సైతం ఇప్పుడు భారతీయ యువత కోసం ఎదురు చూస్తున్నాయి. యువతకు ప్రపంచంలో పెద్ద డిమాండ్ ఉంది. 2047లో ప్రపంచంలోనే భారత్ పెద్ద కమ్యూనిటీ కాబోతోంది. కార్పొరేట్, పబ్లిక్ గవర్నెన్స్‌లో యువత గ్లోబల్ లీడర్లుగా మారే అవకాశం ఉంది. అందులో తెలుగువారు కచ్చితంగా ఉండాలని కోరుకుంటున్నా. మరో పాతికేళ్లపాటు భయం లేకుండా.. దేశంలో 1829 ఏళ్ల మధ్య ఉన్న పనిచేసే యువత 42 కోట్ల మంది ఉన్నారు. 2028 నాటికి ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారత్ మూడో స్థానానికి రావచ్చు. 2047 నాటికి మొదటి లేదా రెండో స్థానానికి వచ్చే అవకాశాలున్నాయి' అని చంద్రబాబు వివరించారు. ఐఐటీఎం విద్యార్థుల్లో ఎవరైనా స్టార్టప్ పెడుతుంటే వినూత్న ఆలోచనలతో ఏపీకి రావాలని చంద్రబాబు ఆహ్వానించారు. ఐఐటీ మద్రాస్‌లో 30 శాతం మంది వరకు తెలుగువారే ఉండటం గర్వంగా ఉందన్నారు. 'నా ఆశ, నమ్మకం మీరే. ఆలోచనలకు పదును పెట్టండి. రాబోయే రోజుల్లో ఏపీలో తలసరి ఆదాయం రూ.50 లక్షలు చేయాలని అనుకుంటున్నాను. మీరు విదేశాలకు వెళ్లి ఇంతకంటే ఎక్కువ సంపాదించి రాష్ట్రానికి తిరిగిచ్చే స్థాయికి రావాలి' అని తెలుగు విద్యార్థులతో చెప్పారు.

# ఇక్కడి బస్సు.. అక్కడ రిజిస్ట్రేషన్

అమరావతి: రాష్ట్రంలో తిరిగే అనేక ట్రావెల్స్ బస్సుల నంబరు ప్లేట్లు ఏఆర్ (అరుణాచల్‌ప్రదేశ్), ఎన్ఎల్ (నాగాలాండ్)తో ఉంటున్నాయి. ఆ రాష్ట్ర బస్సులు ఇక్కడ ఎందుకు నడుపుతున్నారనే సందేహం మీకెప్పుడైనా వచ్చిందా? ఇక్కడ ఉన్న ఎక్కువ పన్ను చెల్లించే బదులు, అతి తక్కువ పన్నులు ఉన్న ఆ రెండు రాష్ట్రాల్లో వాటి యజమాన్యాలు బస్సులను రిజిస్ట్రేషన్లు చేయించుకుంటున్నాయి. దీనివల్ల మన రాష్ట్ర ఖజానాకు ఏటా రూ.82 కోట్ల మేర గండిపడుతోంది. నిబంధనల ప్రకారం ఓ ట్రావెల్స్ బస్సు నడపాలంటే.. అది ఏ రాష్ట్రంలో రిజిస్ట్రేషన్ అయిందో, ఆ రాష్ట్రానికి పన్ను (హోమ్ ట్యాక్స్) చెల్లించాలి. అలాగే కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వన్ ఇండియా, వన్ పర్మిట్‌లో భాగంగా.. ఆలిండియా టూరిస్ట్ పర్మిట్ కింద ఏడాదికి రూ.90 వేలు కేంద్రానికి చెల్లించి దేశంలో ఎక్కడైనా బస్సులు నడిపేందుకు వీలుకల్పించారు. ఇక్కడే అసలు లాజిక్ ఉంది. మన రాష్ట్రంలో ఓ సీటు/ బెర్తుకు త్రైమాసిక (మూడు నెలలకు) పన్ను రూ.4 వేలు చొప్పున ఉంది. ఈ లెక్కన ఓ బస్సుకు సగటున రూ.1.5 లక్షలు చొప్పున, ఏడాదికి రూ.6 లక్షలు చెల్లించాలి. ఇది ఎక్కువగా ఉందని, ఇంత మొత్తం ఎందుకు చెల్లించాలనే ఉద్దేశంతో కొందరు ట్రావెల్స్ యజమానులు 'ఇతర' మార్గాలను ఎంచుకుంటున్నారు.

*** ఆ రాష్ట్రాల్లో నామమాత్రమే..**

- అరుణాచల్‌ప్రదేశ్, నాగాలాండ్ తదితర రాష్ట్రాల్లో రవాణాశాఖ పన్నులు చాలాతక్కువ.
- అరుణాచల్‌ప్రదేశ్‌లో 30, అంతకంటే ఎక్కువ సీట్లు ఉండే బస్సులకు ఏడాదికి రూ.40 వేలు మాత్రమే పన్ను వసూలు చేస్తారు. నాగాలాండ్‌లో సంవత్సరానికి రూ.56 వేలు తీసుకుంటారు.
- ఏపీతో పోల్చుకుంటే ఆ రాష్ట్రాల్లో దాదాపు రూ.5.5 లక్షల పన్నులు తక్కువ. దీంతో పెద్ద సంఖ్యలో మనరాష్ట్ర ట్రావెల్స్ బస్సులు ఈశాన్య రాష్ట్రాలబాట పడుతున్నాయి.
- గత మూడేళ్లలో ఏపీ రిజిస్ట్రేషన్ కలిగిన 1,369 బస్సులకు.. ఇక్కడ నిరభ్యంతర ధ్రువపత్రం (ఎన్‌వోసీ) తీసుకొని వెళ్లి, ఈశాన్య రాష్ట్రాల్లో రీరిజిస్ట్రేషన్ చేయించుకున్నారు.
- ఇలా 1,369 బస్సులకు ఏడాదికి ఏపీ ప్రభుత్వం మొత్తం రూ.82.14 కోట్లు కోల్పోతోంది.

*** కొత్త బస్సులూ అక్కడికే..**

ఇక్కడి ట్రావెల్స్ యాజమాన్యాలు కొనే బస్సుల్లో ఏడాదికి సగటున 100 బస్సులను ఏపీలో కాకుండా ఈశాన్య రాష్ట్రాల్లో రిజిస్ట్రేషన్ చేయిస్తున్నారు. దీనివల్ల వాటి జీవిత పన్ను రూపంలో రూ.6 కోట్లు ఏటా ఏపీ ప్రభుత్వం కోల్పోతోంది. కొత్త బస్సుల ధరపై వసూలు చేసే 28 శాతం జీఎస్టీలో.. 14 శాతం రాష్ట్ర జీఎస్టీ కూడా ఆ రాష్ట్రాలకే వెళుతోంది.

*** బస్సు వెళ్లకుండానే ఫిట్‌నెస్ సర్టిఫికెట్**

ఏ బస్సుకైనా ఎనిమిదేళ్ల వరకు.. ప్రతి రెండేళ్లకు ఓసారి, ఎనిమిదేళ్లు దాటాక ఏడాదికోసారి రవాణాశాఖ వద్ద ఫిట్‌నెస్ పరీక్ష చేయించుకొని ఫిట్‌నెస్ సర్టిఫికెట్ (ఎఫ్‌సీ)తీసుకోవాలి. అరుణాచల్‌ప్రదేశ్, నాగాలాండ్ రాష్ట్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకొని.. మన రాష్ట్ర పరిధిలో నడుపుతున్న బస్సులు.. ఎన్నడూ ఆ రాష్ట్రాలకు వెళ్లి ఫిట్‌నెస్ పరీక్ష చేయించుకోవడం లేదు. ఏపీ నుంచి 2,500 కి.మీ. దూరంలో ఉన్న ఈశాన్య రాష్ట్రాలకు ఎఫ్‌సీ కోసం వెళ్లడంలేదు. ఏజెంట్ల ద్వారా, అక్కడి రవాణాశాఖ అధికారులను మేనేజ్ చేసుకొని ఎఫ్‌సీలు తెచ్చుకుంటున్నాయి. ఇదెంతో ప్రమాదకరమని రవాణాశాఖ వర్గాలు చెబుతున్నాయి.

*** కేంద్రం దృష్టికి సమస్య..**

ఈ వ్యవహారాన్ని ఏపీ ప్రభుత్వం కేంద్రం దృష్టికి తీసుకెళ్లింది. కొంతకాలం కిందట అన్ని రాష్ట్రాల రవాణాశాఖ మంత్రులు, అధికారులతో.. కేంద్ర రవాణా శాఖ మంత్రి గడ్కరీ దిల్లీలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈశాన్య రాష్ట్రాల్లో రిజిస్ట్రేషన్ చేసిన బస్సుల వల్ల ఏపీకి జరుగుతున్న పన్ను నష్టంపై ఆయనకు వివరించారు. అయినా ఇప్పటివరకు ఇంకా ఎటువంటి నిర్ణయం వెలువడలేదు.

# అపార్ట్‌మెంట్లే అచ్చొస్తున్నాయి

(మొదటిపేజీ తరువాయి)

ఉన్నాయి. ఈ క్రమంలో మార్కెట్ విలువ పెంపుపైనా ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.

**జీహెచ్ఎంసీ పరిధిలో అధికం**

అపార్ట్‌మెంట్ల నిర్మాణం, ఫ్లాట్ల విక్రయాలకు హైదరాబాద్ మహానగర పాలక సంస్థ దేశంలోనే పెద్ద మార్కెట్‌గా పేరుగాంచింది. జీహెచ్ఎంసీ వేదికగా ఏటా సగటున రూ.5 వేల కోట్ల స్థిరాస్తి వ్యాపారం జరుగుతోంది. అంతర్జాతీయంగా, దేశీయంగా నెలకొన్న పరిస్థితులతో ఈ ఏడాది వృద్ధి కాస్త సన్నగిల్లినా రిజిస్ట్రేషన్ల రాబడుల్లో 35% వాటా ఫ్లాట్ల విక్రయాలదే కావడం గమనార్హం. రాష్ట్రంలో శాసనసభ, లోక్‌సభ ఎన్నికల కారణంగా రెండేళ్లుగా పెట్టుబడులు తగ్గినట్లు అంచనాలున్నాయి. అయితే, మేడ్చల్ మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లో బహుళ అంతస్తులు, గేటెడ్ కమ్యూనిటీలు, విల్లాల నిర్మాణాలు పెద్ద ఎత్తున సాగుతున్నాయి. హైదరాబాద్ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ పరిధిలో ధరలు భారీగా ఉన్నాయి. తూర్పు, దక్షిణ ప్రాంతాల్లో కొనుగోళ్లు కాస్త తగ్గాయన్న అంచనాలు ఉన్నాయి. అయినప్పటికీ రిజిస్ట్రేషన్ల శాఖ అంచనా వేసిన స్థాయిలోనే రాబడి వచ్చినట్లు ఆయా వర్గాలు చెబుతున్నాయి. రాష్ట్రంలో ఈ ఏడాది ఇళ్ల స్థలాల విక్రయాలతో 23% రాబడి వచ్చింది. ఎల్ఆర్ఎస్ పూర్తయితే మరింత ఆదాయం వస్తుందని అంచనా వేస్తున్నారు. గృహాల విక్రయాల ద్వారా 19.2% రాబడి వచ్చింది. సాగు భూముల రిజిస్ట్రేషన్లతో (ధరణి) రూ.1,668 కోట్లు సమకూరింది. ఇది మొత్తం రాబడిలో 11.5%. హైదరాబాద్ శివార్లలోని రంగారెడ్డి, సంగారెడ్డి, వికారాబాద్, మెదక్, నల్గొండ జిల్లాల్లో ఫాం ల్యాండ్ విక్రయాలు పెద్ద ఎత్తున జరుగుతుండటంతో వాటి ద్వారానే ఎక్కువ రాబడి వస్తున్నట్లు అంచనా. ఫాం ల్యాండ్ల విక్రయాలకు సంబంధించి తక్కువ విస్తీర్ణం రిజిస్ట్రేషన్ విషయమై ప్రభుత్వానికి ఫిర్యాదులున్నాయి. వీటి కట్టడికి ప్రస్తుత ఆర్వోఆర్ చట్టంలో ఎలాంటి నిబంధనలు లేవని అధికారులు చెబుతున్నారు. రాష్ట్రంలో భూములు, స్థిరాస్తికి సంబంధించి... బహిరంగ ధరలకు, మార్కెట్ విలువకు మధ్య భారీ వ్యత్యాసమున్నట్లు ప్రభుత్వం గుర్తించింది. ఈ కారణంగానే రిజిస్ట్రేషన్లు భారీగానే జరుగుతున్నా అంచనాలకు తగినట్లు రాబడి రావడం లేదని భావిస్తున్నట్లు సమాచారం. ఈ క్రమంలో ఈ విలువను సరిచేసేందుకు కసరత్తు చేస్తోంది. అయితే, ఎప్పటి నుంచి కొత్త విలువలను అమలు చేస్తారన్న దానిపై స్పష్టత లేదు. ప్రభుత్వ అంచనా ప్రకారం... వ్యవసాయ భూములకు సంబంధించి ప్రస్తుతమున్న మార్కెట్ విలువను పదిరెట్లు (501000%), ఫ్లాట్ల విలువను రెండు రెట్లు (20100%), స్థలాల విలువను ఐదు రెట్ల వరకు (50500%), గృహాలు/నిర్మాణాల విలువను రెండు రెట్లు (50100%) పెంచితేనే బహిరంగ ధర, మార్కెట్ విలువ మధ్య ఉన్న వ్యత్యాసం దాదాపు సమానమయ్యే అవకాశాలు ఉన్నట్లు అంచనా వేస్తున్నారు.

# భానుడి భగభగలు

(మొదటిపేజీ తరువాయి)

181 ప్రాంతాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటాయి. 15 మండలాల్లో తీవ్ర వడగాలులు, 90 మండలాల్లో వడగాలులు వీచాయి. శనివారం 35 మండలాల్లో తీవ్ర వడగాలులు, మరో 223 మండలాల్లో వడగాలులు వీచే అవకాశముందని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ కూర్మనాథ్ తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లాలో 12 మండలాలు, విజయనగరం 9, శ్రీకాకుళం 6, అల్లూరి సీతారామరాజు 3, కాకినాడ 3, తూర్పుగోదావరి జిల్లాలో 2 మండలాల్లో తీవ్ర వడగాలులు వీస్తాయని అంచనా వేస్తున్నారు. పల్నాడు జిల్లాలో 24 మండలాలు, శ్రీకాకుళం 19, తూర్పుగోదావరి 17, ఏలూరు 17, గుంటూరు 17, విజయనగరం 16, అనకాపల్లి 16, కృష్ణా 15, కాకినాడ 15, డా. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ 12, ఎన్టీఆర్ 12, పశ్చిమగోదావరి 10, ప్రకాశం 9, అల్లూరి సీతారామరాజు 8, బాపట్ల 8, విశాఖపట్నం 3, పార్వతీపురం మన్యం 2, తిరుపతి 2, నెల్లూరు జిల్లాలో ఒక మండలంలో వడగాలులకు అవకాశముందని పేర్కొన్నారు. ఆది, సోమ, మంగళవారాల్లో రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని, పిడుగులు పడొచ్చని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది.

# సన్నబియ్యం పంపిణీ.. తెలంగాణలోనే ప్రథమం

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్రంలో దాదాపు 84 శాతం మంది పేదలకు ఉచితంగా సన్నబియ్యం అందించబోతున్నామని చెప్పారు. ఉగాది రోజున ఆదివారం హుజూర్‌నగర్ వేదికగా ఈ పథకాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభిస్తారని తెలిపారు. ఏప్రిల్ 1 నుంచి అర్హులందరికీ రాష్ట్రవ్యాప్తంగా పంపిణీ చేస్తామని చెప్పారు. రాష్ట్రంలో కొత్తగా మరో 30 లక్షల మందిని రేషన్‌కు అర్హులుగా గుర్తించబోతున్నట్లు వెల్లడించారు. శుక్రవారం ఆయన హుజూర్‌నగర్‌లో సీఎం సభ ఏర్పాట్లను పరిశీలించి వచ్చి సచివాలయంలో సాయంత్రం విలేకరులతో మాట్లాడారు. పేదలకు త్వరలో ఉప్పు, పప్పు, చింతపండు వంటి సరకుల్ని కూడా రేషన్‌దుకాణాల ద్వారా అందిస్తామని, క్రమక్రమంగా సరకుల సంఖ్య పెంచుతామని మంత్రి వెల్లడించారు. ''దొడ్డుబియ్యం స్థానంలో సన్నబియ్యం పంపిణీ వల్ల రాష్ట్రంపై రూ.2,800 కోట్ల అదనపు భారం పడనుంది. ఆ భారాన్ని భరించాలని కేంద్రాన్ని కోరా. ప్రతి లబ్ధిదారుకు 6 కిలోల బియ్యం ఇస్తాం. తెలంగాణ వ్యాప్తంగా ఎక్కడైనా రేషన్ తీసుకోవచ్చు. అధికారుల వద్ద ఉన్న జాబితాలో పేరుంటే కార్డులేకపోయినా రేషన్ తీసుకోవచ్చు. నా సుదీర్ఘ రాజకీయ అనుభవంలో ఇంత మంచి సంక్షేమ పథకాన్ని చూడలేదు.

# థాయ్‌లాండ్, మయన్మార్‌లలో భూ విలయం

బ్యాంకాక్: నిమిషాల వ్యవధిలో వెంట వెంటనే వచ్చిన రెండు భారీ భూకంపాలు థాయ్‌లాండ్, మయన్మార్ దేశాల్లో పెను విధ్వంసం సృష్టించాయి. ప్రాథమిక సమాచారం ప్రకారం రెండు దేశాల్లో 150 మందికి పైగా ప్రజలు మృతి చెందారు. 750 మందికి పైగా గాయపడ్డారు. అయితే మృతుల సంఖ్య భారీగా పెరిగే అవకాశం ఉందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. పలు భవనాలు, ప్రార్థనాలయాలు, సాధువుల మఠాలు కుప్పకూలాయి. ప్రాణ నష్టం అత్యధికంగా మయన్మార్‌లోని మాండలే నగరం, దాని పరిసర ప్రాంతాల్లో జరిగింది. రెండు భూకంపాల కేంద్ర స్థానాలూ ఇక్కడికి సమీపంలోనే ఉన్నాయి. థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్‌లో తీవ్ర ఆస్తి నష్టం జరిగింది. రెండు దేశాల్లోనూ అక్కడి ప్రభుత్వాలు వివిధ ప్రాంతాల్లో ఆత్యయిక పరిస్థితిని ప్రకటించాయి. ప్రకృతి విపత్తులో చిక్కుకున్న ఈ దేశాలకు చేయూత అందిస్తామని భారత ప్రధాని మోదీ తెలిపారు. సహాయక చర్యలకు అండగా నిలుస్తామన్నారు. భూప్రకంపనల ప్రభావం భారత్‌తో పాటు చైనా, బంగ్లాదేశ్‌లోని పలు ప్రాంతాల్లోనూ కనిపించింది. మయన్మార్, థాయ్‌లాండ్‌లలో క్షతగాత్రులైన వారికి చికిత్స అందించేందుకు ప్రపంచ ఆరోగ్య సంస్థ ముందుకొచ్చింది. శుక్రవారం ఉదయం 11.50 గం.లకు సంభవించిన తొలి భూకంపం కేంద్రం మయన్మార్‌లోని సాగాయింగ్ పట్టణానికి 12 కి.మీ. దూరంలో ఉంది. మధ్యాహ్నం 12.02లకు వచ్చిన రెండో భూకంపం కేంద్రం కయక్స్ పట్టణానికి 20 కి.మీ.దూరంలో ఉంది. భూ ఉపరితలానికి 10.కి.మీ లోతులోనే ప్రకంపన కేంద్రాలు ఉండడంతో నష్ట తీవ్రత అధికంగా ఉందని అమెరికాకు చెందిన జియోలాజికల్ సర్వే సంస్థ వెల్లడించింది.

# ఎన్నికల హామీల అమలులో.. కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

*** గంగిడి మనోహర్ రెడ్డి**

చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్ రెడ్డి ఆరోపించారు. చౌటుప్పల్ మున్సిపల్ పరిధి లింగోజిగూడెం గ్రామంలో బిజెపి మున్సిపల్ అధ్యక్షురాలు కడారి కల్పన ఐలయ్య యాదవ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హులై, లబ్ధి పొందని ప్రజలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందని ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా



గంగిడి మనోహర్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల హామీల్లో భాగంగా 6గ్యారంటీలు, హామీలిచ్చి అధికారం చేపట్టిన కాంగ్రెస్ పార్టీ, 15నెలలు గడుస్తున్నా హామీల అమలులో మాత్రం నత్తనడకన పనిచేస్తుందని అసంతృప్తి వ్యక్తం చేశారు. వృద్ధులకు, వితంతువులకు, వికలాంగులకు పింఛన్లు రూ.2వేల నుంచి 4వేలకు పెంచుతామని ఇచ్చిన హామీ కార్యరూపం దాల్చలేదని చూపించారు. మహాలక్ష్మి పథకం కింద ప్రతి గృహిణికి రూ.2500లు ఇస్తామన్న హామీ జాడ లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్హత ఉండి పథకాలు నోచుకోని ప్రజలు చాలామంది ఉన్నారని, వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. ఈ దరఖాస్తులను తహసిల్దార్, జిల్లా కలెక్టర్ లకు అందజేసే ప్రయత్నం చేస్తున్నామన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం హామీలన్నీ నెరవేర్చే వరకు రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి మునుగోడు నియోజకవర్గ కన్వీనర్ దూడల భిక్షం గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు రమణ గోని శంకర్, మండల అధ్యక్షుడు కైరంకొండ అశోక్, కంచర్ల గోవర్ధన్ రెడ్డి, బత్తుల జంగయ్య గౌడ్, శాగ చంద్రశేఖర్ రెడ్డి, ఊడుగు యాదయ్య గౌడ్, కడారి ఐలయ్య యాదవ్, కట్ట కృష్ణ, బండారు మహేందర్ రెడ్డి, ఊదరి రంగయ్య, ఎర్రగోని మల్లేష్, 26వ బూత్ అధ్యక్షుడు బాతరాజు ప్రవీణ్, 27వ బూత్ అధ్యక్షుడు ఇటికాల దామోదర్ రెడ్డి, బాతరాజు లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ పద్మావతి వేంకటేశ్వర స్వామిఆలయ హుండీ లెక్కింపు



ప్రజాస్ఫూర్తి, కాప్రా : కుషాయిగూడలోని శ్రీ పద్మావతి వేంకటేశ్వర స్వామిఆలయ హుండీలు శుక్రవారం లెక్కించారు. దేవాదాయ శాఖ పర్యవేక్షణాధికారి సీహెచ్. ప్రణీత్ కుమార్ సమక్షం లో విప్పి లెక్కించగా రూ. 7,19,955/లు ఆదాయం వచ్చింది. ఇట్టి హుండీ లెక్కింపు నందు ఆలయ ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ సంకూరి శ్రీనివాస్ గౌడ్, కార్యనిర్వాహణాధికారి యం. వీరేశం, తాళ్ళ వెంకటేష్ గౌడ్, ప్రేమ్ కుమార్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, శ్రీకాంత్ యాదవ్, రఘుపతి గౌడ్, ఆర్.కే. లక్ష్మీ నారాయణ, అమరా చారి, ఉమా సేవకురాలు, మహిళా సభ్యులు , దేవస్థాన అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు

## జామి మసీద్ ఈ మహమ్మద్ మసీదులో ఘనంగా ఇఫ్తార్ విందు




ప్రజాస్ఫూర్తి, కాప్రా : మైనార్టీ సోదరులకు పవిత్రంగా భావించే రంజాన్ మాసం సందర్భంగా ఆఖరి శుక్రవారం రోజు డాక్టర్ ఎస్ ఆర్ నగర్ డివిజన్ అన్నపురం కాలనీలో గల జామి మసీద్ ఈ మహమ్మద్ మసీదులో ఇఫ్తార్ విందు రియాజ్ అహ్మద్ ఖాన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు హాజరై మైనారిటీ సోదరులు ఉపవాస దీక్ష ను పవిత్రంగా భావిస్తారు వారికి ఇఫ్తార్ శుభాకాంక్షలు తెలియజేస్తూ రియాజ్ కి పండ్లు తినిపించి ఇఫ్తార్ విందును షురూ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో రియాజ్ అహ్మద్ ఖాన్, జైమిత్ అమిత్ పాష, జమీల్ ఖాన్, మహమ్మద్ ఇక్బాల్ హిమాం నజీముద్దీన్ , మోసిన్ మహమ్మద్ గౌస్, పెద్దాపురం కుమార్ స్వామి , బేతాళ బాలరాజు , షేర్ మణమ్మ , సత్యనారాయణ గౌడ్ , నాగపురి రాజు , ప్రమోద్ చారి తదితరులు మైనార్టీ సోదరులు పాల్గొన్నారు.

## కష్టపడి.. చదవి ఉద్యోగం సాధించాలి

**- సిరిసిల్ల ట్రాఫిక్ ఎస్ఐ అల్లం రమేష్**



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: పోటీ పరీక్షలకు ప్రిపేర్ అయ్యే వారు కష్టపడి చదవి ఉద్యోగం సాధించాలని సిరిసిల్ల పట్టణ ట్రాఫిక్ ఎస్ఐ అల్లం రమేష్ అన్నారు. రాజన్న సిరిసిల్లా బీసీ స్టడీ సర్కిల్ ఉద్యోగ నైపుణ్య శిక్షణ కేంద్రంలో ఆర్ఆర్బి, బ్యాంకింగ్, యస్యస్సి కోచింగ్కు వచ్చిన విద్యార్థిని విద్యార్థులకు శుక్ర వారం ఆయన మోటివేషన్ ఇచ్చారు. తను చదువుకున్న స్థితి గతులు, ఇప్పుడు వస్తున్న పేపర్ మోడల్ గూర్చి, ఆర్థమాటిక్ అప్లికేషన్ మెథడ్ గూర్చి, కరెంట్ అఫ్ఫైర్స్ గూర్చి పూర్తిగా వివరించారు. ఈ కార్యక్రమంలో బిసి స్టడీ సర్కిల్ డైరెక్టర్ జెల్ల వెంకటస్వామి, కోర్స్ కోఆర్డినేటర్ హరీష్, ఫ్యాకల్టీ నాగరాజు, సిబ్బంది సురేష్, దివ్య, ప్రసాద్, మురళీ, వనిత పాల్గొన్నారు.



## సాంప్రదాయబద్ధంగా ఆనందంగా ఉగాది పండగ జరుపుకోవాలి

*** భువనగిరి పట్టణ మున్సిపల్ వైస్ చైర్మన్ మాయ దశరథ**

యాదాద్రి భువనగిరి , (ప్రజాస్ఫూర్తి) : హిందువుల సాంప్రదాయాలని గౌరవిస్తూ సాంప్రదాయబద్ధంగా ఆనందంగా ఉగాది పండగ జరుపుకోవాలని హిందువుల గొప్పతనాన్ని చాటాలని భువనగిరి పట్టణ మున్సిపల్ వైస్ చైర్మన్ మాయ దశరథ అన్నారు. నూతన విశ్వస నామ ఉగాది పర్వదినం సందర్భంగా ప్రతి ఇంటిపైన జెండా ఎగరవేయాలని భువనగిరి గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షులు రత్నాపురం శ్రీశైలం అధ్యక్షతన స్థానిక సవర్కా చౌరస్తా లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన తో పాటు భారతీయ జనతా పార్టీ జిల్లా సీనియర్ నాయకులు చందా మహేందర్ గుప్తా, టిఆర్ఎస్ మాజీ కౌన్సిలర్ చిన్న స్వాతి మహేష్, సనాతన హిందూ దేవాలయాల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షులు దేవరకొండ నరసింహ చారి లు పాల్గొన్నారు. ఈ సందర్భహంగా ఆయన మాట్లాడుతూ నూతన విశ్వస నామ ఉగాది శుభాకాంక్షలు తెలియజేస్తూ ప్రతి ఇంటిపైన ఉగాది పండగ రోజునా ఉదయం 11:05 నిమిషాలకు ఈ కార్యక్రమంలో హిందూ బంధువులు అందరూ భాగస్వాములై కార్యక్రమాన్ని ముందుకు తీసుకుపోవాలని అన్నారు . ప్రతి ఇంటిపైన ఉగాది రోజు భగవద్వజం (జెండా) ఇంటింటికి ఎగరాలని నూతన సంవత్సర సందర్భంగా మొట్టమొదటిగా మనము చేసే ప్రతీ కార్యక్రమం విజయం కావాలని కోరుకుంటూ కుటుంబ సమేతంగా ఇంటిపైన జెండాను ఎగరవేయాలని అన్నారు, అనంతరం భగవత్ ద్వజాల( జెండాలు) పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పచ్చళ్లకట్ట సోమేశ్వర స్వామి దేవాలయ కమిటీ మాజీ చైర్మన్ కాలేరు లక్ష్మణరావు, బిజెపి సీనియర్ నాయకులు పాదరాజు ఉమా శంకర్ రావు, గురుస్వామి బ్రాహ్మణులు ఎన్ వి డి నాగేశ్వర్,భువనగిరి గణేష్ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శులు బెల్లంకొండ చందు, కుంచం రాజు,ఉపాధ్యక్షులు కాలియా నాగరాజు,నామోజు రాజు, తాటి పెల్లి రవీందర్, తాడూరి రాజ్ కుమార్,కార్యదర్శులు సాయికిరణ్ కానుగంటి ప్రేమ్ కుమార్ సాయి చరణ్ రత్నాపురం శ్రీరామ్ గౌలికర్ కిషన్ జి ఎంజాల రాంప్రసాద్, బండారు కార్తీక్ సుదగాని ప్రమోద్ కుమార్ , కృష్ణప్రసాద్, బాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి కాంట్రాక్టు కార్మికుల వేతనాలు సకాలంలో చెల్లించాలి

*** సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు భూక్య రమేష్.**



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: సింగరేణి కాంటాక్ట్ కార్మికులకు ప్రతినెల 7వ తేదీ లోపు ఇవ్వాల్సిన జీతాలు ఇవ్వకుండా ప్రతినెల 20వ తారీకు పైనే ఆలస్యంగా చేస్తూ జీతాలు ఇవ్వడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని కార్మికుల ఇవ్వాల్సినటువంటి బూట్లు హెల్మెట్ డ్రెస్సులు కూడా ఇవ్వకుండా నిర్లక్ష్యం వహిస్తున్న కాంట్రాక్టర్లపై వెంటనే చర్యలు తీసుకోవాలని సివిల్ డిప్యూటీ సీఎం రాజశేఖర్ కి సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం ఆధ్వర్యంలో ప్రతి పత్రాన్ని ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా సింగరేణి కాంటాక్ట్ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు సురమైలయ భూక్య రమేష్ మాట్లాడుతూ ప్రతినెల ఏడో తారీఖు నివాసం జీతాలు ఇవ్వకుండా కార్మికుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని కోరారు కార్మికులకు కాంట్రాక్టు కార్మికులకు ఇవ్వవలసిన బూట్లు డ్రెస్సులు హెల్మెట్లు ఇతర పనిముట్లు సకాలంలో ఇవ్వకుండా అనేక ఇబ్బందులకు గురి చేస్తూ కాంటాక్ట్ కార్మికుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని వారన్నారు గతంలో సింగరేణి అధికారులకు ఉన్నతాధికారులకి సిఐటి ఆధ్వర్యంలో వినతి పత్రాలు ఇచ్చి ఉన్నామని అయినప్పటికీ ఎటువంటి పట్టింపు లేకుండా ఉండడం వల్ల ఇలా నిర్లక్ష్యపు పద్ధతులు పునరావృతం అవుతూనే ఉన్నాయని వారన్నారు ఇప్పటికైనా అధికారులు దృష్టిసారించి ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ప్రతి నెల 7వ తారీకు లోపు జీతాలు వచ్చేలా వారికి సంబంధించినటువంటి పనిముట్లు అన్ని అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు ఈ కార్యక్రమంలో కాంట్రాక్టు కార్మిక సంఘం నాయకులు సక్రమ్ స్వామి, శంకర్, బాబురావు, తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ కు శుభాకాంక్షలు తెలిపిన బీఆర్ఎస్ నేతలు

కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అభివృద్ధి , సంక్షేమ పథకాలపై తనదైన శైలిలో అసెంబ్లీలో గలమేత్తిన బిఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ను శుక్రవారం బీఆర్ఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.



ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి డివిజన్ అధ్యక్షులు పుప్పాల భాస్కర్, రుద్ర అశోక్, పోలే శ్రీకాంత్, పాక్స్ డైరెక్టర్ శ్రీనివాస్ యాదవ్, సాయి కిరణ్ ,శ్రీకర్ , కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

## రాజపేటలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమం



రాజపేట, ప్రజా స్ఫూర్తి : రాజపేట మండల కేంద్రంలోని అతిథి గృహంలో శుక్రవారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నమిల మహేందర్ గౌడ్ అధ్యక్షతన జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కిసాన్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుడిగ పెంటయ్య గౌడ్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆలేరు మార్కెట్ కమిటీ డైరెక్టర్లు సెలవేరు బాలరాజు గౌడ్, మాలోత్ విఠల్ నాయక్, నమిల కేదారి గౌడ్, పాండవుల బసవరాజు గౌడ్, రఘునాథపురం అధ్యక్షులు రమేష్, బత్తిని సుధాకర్ గౌడ్, అత్తవెల్లి శ్రీకాంత్, తిరుపతి, చెన్నయ్య, గ్రామ శాఖ అధ్యక్షులు, బాధ్యులు, పార్టీ ప్రముఖులు, నాయకులు పాల్గొన్నారు.


## తహసిల్దార్ ఇంద్రకర్ అనితను సత్కరించిన బిజెపి, బిఆర్ఎస్ పార్టీలు



రాజాపేట, ప్రజా స్ఫూర్తి : రాజపేట తహసిల్దారుగా బాధ్యతలు చేపట్టిన ఇంద్రకర్ అనిత ను శుక్రవారం బిజెపి, టిఆర్ఎస్ పార్టీలవారు వేరువేరుగా సత్కరించారు. రాజపేట భారతీయ జనతా పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో నూతనంగా వచ్చిన రాజపేట మండల తహసీల్దార్ ని మర్యాదపూర్వకంగా కలసి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు మేకల రమేష్, మండల ప్రధాన కార్యదర్శి గాండ్ల నర్సింగరావు, దాచేపల్లి శ్రీనివాస్, రేణిగుంట తాజా మాజీ ఉపసర్పంచ్ బూర్గు శేకర్ రెడ్డి, ఎస్టీ సెల్ రాష్ట్ర నాయకులు భూక్య శ్రీను నాయక్, సాదన బోయిన శెంకర్, మెందు భగవాన్ రెడ్డి, మార్క శివ, బొంగోని నర్సయ్య, పుప్పాల నరేష్, శాపురం శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు. టిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు సట్టు తిరుమలేశ, జిల్లా ఎస్సీ సెల్ నాయకులు ఎర్రగోకుల జస్వంత్, ముదిరాజ్ సంఘం మండల శాఖ అధ్యక్షులు పులి చంద్రమౌళి తదితరులు ఉన్నారు.

## రాజ్యాంగ విలువల పై ప్రజల్లో అవగాహన పెంచడమే లక్ష్యం

*** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య**



యాదాద్రి భువనగిరి , (ప్రజాస్ఫూర్తి) : రాజ్యాంగ విలువల పై ప్రజల్లో అవగాహన పెంచడంమే లక్ష్యమని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు. ఏఐసిసి, పీసీసీ పిలుపు మేరకు జై బాపు జైభీం జై సంవిధాన్ కార్యక్రమాన్ని శుక్రవారం ఆలేరు పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఆయనతో పాటు ఇంఛార్జి బొజ్జ సంధ్య రెడ్డి ముఖ్యఅతిథిలుగా హాజరైయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య మాట్లాడుతూ భారతదేశ రాజ్యాంగం అమలుకి వచ్చి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు.గ్రామ మండల స్థాయిలో ఈ కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకొని వెళ్లాలని కోరారు.గాంధీ అంబెడ్కర్ ఆశయాలను సిద్ధాంతాలను దేశంలో అమలు చేయాల్సిన సమయం వచ్చిందన్నారు. పేద బలహీన వర్గాలప్రజల ఆకాంక్షలు నెరవేరటం లేదని,ప్రధానికి పేద ప్రజల కంటే బడా బాబుల్ ముఖ్యం అన్నారు. రాజ్యాంగం కేవలం ఒక పుస్తకం కాదు అంబెడ్కర్ గాంధీ పూలే లాంటి గొప్ప వాళ్ళ ఆలోచనల తో కూడిన ఒక పవిత్ర గ్రంథం అన్నారు.

# మతసామరస్యాన్ని చాటుతూ లౌకిక విలువలను కాపాడుకుందాం

* **కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు**
* **కొత్తగూడెం క్లబ్బులో వెల్లివిరిసిన ఆధ్యాత్మికత**

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: మతసామరస్యాన్ని చాటుతూ లౌకిక విలువలను కాపాడుకోవడం మనందరి బాధ్యతని, అందుకు పండుగలు దోహదపడతాయని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని శుక్రవారం పట్టణంలోని కొత్తగూడెం క్లబ్బులో కొత్తగూడెం పట్టణం, చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి, సుజాతనగర్ మండేలా స్థాయి ఇఫ్తార్ విందు కార్యక్రమానికి అయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రత్యేక నమాజు అనంతరం ఉపవాస దీక్ష విరమించిన ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సభలో కూనంనేని మాట్లాడుతూ రంజాన్ మాసంలో నిర్వహిస్తున్న ఇఫ్తార్ విందు కార్యక్రమాలు ప్రజల మధ్య ఐక్యతాభావం పెంచుతున్నాయని అన్నారు. ప్రజల ఆచార వ్యవహారాలను గౌరవిస్తూ ప్రభుత్వం పండుగల సమయాల్లో అధికారిక కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. పవిత్ర రంజాన్ మాసం సమాజంలో శాంతిని నెలకొల్పుతుందన్నారు. రంజాన్ పండుగ సందర్భంగా ముస్లిం సోదరులు చేపట్టిన కఠినమైన ఉపవాస దీక్షలు వారి కుటుంబాలతో పాటు సమాజంలో శాంతిని, ప్రేమను నెలకొల్పడానికి, సోదర భావం, దాతృత్వాన్ని పెంచడానికి దోహదపడుతుందని,



ప్రజాస్వామ్య దేశంలో కులమతాలకతీతంగా మతసామరస్యాన్ని చాటి చెబుతోందన్నారు. జిల్లా కలెక్టర్ జీతేష్ వి పాటిల్, ఎస్పీ రోహిత్ రాజ్, సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా, మైనార్టీ నాయకులు నయీమ్ ఖురేషి, ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం డిఎస్పీ అబ్దుల్ రహమాన్, మత గురువులు మహమ్మద్ మునావర్ హుస్సేన్, అబ్దుల్ అజీజ్ మంజార్, మత పెద్దలు జహంగీర్ షరీఫ్, రబ్ సాబ్, అబీద్ హుస్సేన్, జావీద్ సాటే, బాసిత్ భాయ్, ఖాద్రి, యాకుబ్, సిపిఐ నాయకులు దుర్గరాశి వెంకన్న, వాసిరెడ్డి మురళి, తూము చౌదరి, నాగా సీతారాములు, పల్లపోతు సాయి, మాజీ కౌన్సిలర్స్, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## అందరి సహకారంతో ఆరోగ్య సభలు విజయవంతం



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: ప్రకృతి ఆశ్రమ ఆధ్వర్యంలో కొత్తగూడెంలో నిర్వహించిన ఆరోగ్య మహాసభలు అందరి సహకారంతో విజయవంతం అయ్యాయని నిర్వాహకులు పేర్కొన్నారు. కొత్తగూడెం బస్టాండ్ సమీపంలో ఆశ్రమ సర్వసభ్య సమావేశం జరిగింది. సభలనువిజయవంతం చేసినందుకు ప్రకృతి ప్రేమికులకు, పర్యావరణ పరిరక్షకులకు, ఆరోగ్యాభిలాషులకు అభినందనలు తెలియజేశారు.ప్రత్యేకించి మీడియా వారికి కృతజ్ఞతలు తెలియజేశారు.ప్రకృతి ఆరోగ్యం పైన పర్యావరణ పరిరక్షణ పైన కలెక్టర్ జితేష్ వి పాటిల్ అందించిన స్ఫూర్తితో మరింత ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చారు. మహాసభల విజయవంతానికి ఆర్థికంగా, హార్దికంగా సహాయ సహకారాలు ప్రత్యక్షంగా, పరోక్షంగా అందించిన వారందరికీ పేరు పేరునా అభినందనలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఆశ్రమం ముఖ్య సలహాదారు, తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్సంగం వెంకటపుల్లయ్యను ఘనంగా సత్కరించి సన్మానించారు.సింగరేణి రిటైర్డ్ జిఎం శనగ వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో, మొక్కల వెంకటయ్య, డాక్టర్ బి కృష్ణయ్య, సింగరేణి ఏజీఎం గోనే శ్రీకాంత్, మన్ కీ బాత్ మొక్కల రాజశేఖర్, కోఆర్డినేటర్ సుగుణా రావు, బంగారు శంకర్, దయానంద సాగర్, రాజేంద్రప్రసాద్, తుంపూడి శివ రగణబాబులు పాల్గొన్నారు.

## కాల్వల కోసం అందించిన భూమిని తిరిగి ఇవ్వాలంటూ ధర్నా

* **సిపిఐ ఆధ్వర్యంలో కార్యక్రమం.. మద్దతిచ్చిన బిఆర్ఎస్**




రాజపేట, ప్రజా స్ఫూర్తి : రాజపేట మండలం బేగంపేట గ్రామం రైతులు రాజపేట ఎమ్మార్వో ఆఫీసు ముందు శుక్రవారం ధర్నా నిర్వహించారు. సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. కాళేశ్వరం ప్రాజెక్టు కింద కాలువల కోసం దాదాపు 80 ఎకరాల భూమి 70 మంది రైతులు ఇచ్చారని, కాళేశ్వరం కాల్వ భూ సేకరణ చేసి భూమిని దరణి నుండి తొలగించినట్లు చెప్పారు. ఆరు సంవత్సరాల నుండి రైతుల భూమి ప్రభుత్వ ఖాతాలోకి వెళ్లిపోయిందని, రైతులకు నష్టపరిహారం చెల్లించకుండా రైతుల భూమిని ప్రభుత్వం ఆధీనంలోకి వెళ్లిపోయిందన్నారు. ఈ సందర్భంగా సిపిఐ పార్టీ మండల కార్యదర్శి చిగుళ్ల లింగం మాట్లాడుతూ రైతుల నుండి తీసుకున్న భూమిని వెంటనే రైతులకు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సిపిఐ పార్టీ చేస్తున్న ధర్నాకు టిఆర్ఎస్ పార్టీ పూర్తి మద్దతు తెలిపిందన్నారు. అనంతరం తహసిల్దార్ ఇంద్రాకర్ అనితకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమానికి మద్ద తెచ్చిన టిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు సట్టు తిరుమలేష్, ఎస్సీ సెల్ నాయకులు ఎర్రగోకుల జస్వంత్, రైతు అంకతి సుదర్శన్ లు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి మండల కార్యదర్శి మూల పోచయ్య, టిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు సట్టు తిరుమలేశం, జస్వంత్, ఒగ్గు కరుణాకరు పాల్గొన్నారు. రైతులు ప్రభాకర్, ఉప్పలయ్య, లచ్చులు, పద్మ, గోనె బాలయ్య, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.






## చౌటుప్పల్ మున్సిపాలిటీ సమస్యలన్నీ పరిష్కరించాలి

- **మున్సిపల్ కార్యాలయం ఎదుట సిపిఎం ధర్నా**

గోశిక కర్ణాకర్

చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి:

చౌటుప్పల్ మున్సిపాలిటీలోని అన్ని రకాల సమస్యలు పరిష్కరించాలని సిపిఎం మున్సిపల్ కార్యదర్శి గోశిక కర్ణాకర్ డిమాండ్ చేశారు. చౌటుప్పల్ మున్సిపల్ పరిధిలోని సమస్యలన్నీ పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో చౌటుప్పల్ మున్సిపల్ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గోశిక కర్ణాకర్ మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో సిపిఎం పోరుబాటలో భాగంగా మార్చి 17వ తేదీ నుంచి 27వరకు మున్సిపాలిటీలోని 20వార్డుల్లో ప్రజలకు ఉన్న సమస్యలపై అధ్యయనం చేశామన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు పెన్షన్లు, ఇండ్లు, ఇండ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మున్సిపాలిటీ పరిధిలో వార్డుల్లో నెలకొన్న మంచినీటి సమస్యను వెంటనే పరిష్కరించాలన్నారు. ఇంటి పన్ను తగ్గించాలని, తోపుడు బండ్ల వాళ్లకు మార్కెట్ ను ఏర్పాటు చేయాలన్నారు. చౌటుప్పల్ పెద్ద చెరువుని నాగులకుంటను మంచినీటితో నింపి సుందరీ కరణ చేయాలన్నారు. అసంపూర్తిగా ఉన్న ఇండోర్ స్టేడియాన్ని, కస్తూర్బా స్కూల్, డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలన్నారు. మున్సిపాలిటీలోని అన్ని స్మశానవాటి కలను నిర్మించాలని, అదేవిధంగా అన్ని వార్డుల్లోని దివిస్ వాటర్ ప్లాంట్ ను పునః ప్రారంభించాలన్నారు. గాంధీ పార్కు సుందరీకరణ చేసి సులాబ్ కాంప్లెక్స్ నిర్మించాలన్నారు. వంద పడకల ఆసుపత్రిని త్వరగా ప్రారంభించాలన్నారు. ఎల్ఆర్ఎస్ ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సర్వీస్ రోడ్లు వేస్తున్న అండర్ డ్రైనేజీ ని పునర్నిర్మించాలని డిమాండ్ చేశారు. అనంతరం చౌటుప్పల్ మున్సిపల్ కమిషనర్ కోమటిరెడ్డి నరసింహారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ కార్యదర్శి వర్గ సభ్యుడు బూరుగు కృష్ణారెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు ఎండీ పాషా, అవ్వారి రామేశ్వరి, రాగీరు కృష్ణయ్య, నాయకులు బండారు నర్సింహ్మ, బత్తుల దాసు, ఆకుల ధర్మయ్య, దండ అరుణ్ కుమార్, గోపగోని లక్ష్మణ్, ఉష్కాగుల శ్రీనివాస్, కందగట్ల ఆనంద్, తొర్పునూరి మల్లేశం, బొడ్డు అంజిరెడ్డి, గుణమోని ఐలయ్య, సప్పిడి శ్రీనివాసరెడ్డి, కల్వకుంట్ల శివ, ధర్మారెడ్డి, బాతరాజు దశరథ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## అనుమతుల్లేని భవనంలో.. ఆంబిటస్

- **ఆంబిటస్ ది స్కూల్ ఎదుట ధర్నా**
- **పబ్బు వంశీ గౌడ్**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: అనుమతుల్లేని భవనాల్లో.. ఆంబిటస్ ది స్కూల్ ను నిర్వహిస్తూ.. విద్యార్థుల జీవితాలతో పాఠశాల యాజమాన్యం చెలగాటమాడుతుందని బీజేవైఎం మండల అధ్యక్షుడు పబ్బు వంశీ గౌడ్ ఆరోపించారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం వలిగొండ రోడ్డులోని ఆంబిటస్ ది స్కూల్ ఎదుట బీజేవైఎం ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. పాఠశాల యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పబ్బు వంశీ గౌడ్ మాట్లాడుతూ అనుమతులు లేని భవనంలో విద్యా సంవత్సరం నిర్వహిస్తూ, యాజమాన్యం విద్యార్థులకు అన్యాయం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాల బస్సులలో పరిమితికి మించి విద్యార్థులను నింపుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. చౌటుప్పల్ పరిధిలో ఎక్కడా లేనివిధంగా అత్యధిక ఫీజులను వసూలు చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. విద్యా హక్కు చట్టానికి విరుద్ధంగా రాబోయే విద్యా సంవత్సరానికి సంబంధించిన అడ్మిషన్లను తీసుకోవడం సమంజసం కాదన్నారు. విషయం తెలుసుకున్న ఎంఈవో గురువారావు పాఠశాల వద్దకు చేరుకొని, బీజేవైఎం నాయకులతో మాట్లాడారు. పాఠశాలకు సంబంధించిన అన్ని అనుమతులను పరిశీలిస్తానని తెలిపారు. పది పరీక్షలు జరుగుతున్నందున, తనకు సమయం లేదని తెలిపారు. ధర్నాతో విద్యార్థులు ఇబ్బందులకు గురయ్యే అవకాశం ఉందని విద్యార్థి సంఘం నాయకులకు నచ్చజెప్పి పంపించారు. అంతకుముందు బీజేవైఎం నాయకులు ఎంఈవో గురువారావుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర నాయకుడు మునగాల రాజశేఖర్ రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు చింతకింది కిషోర్, నాయకులు పందుల శరత్ గౌడ్, పల్లె వెంకటేష్, శివ మల్లారెడ్డి, వెల్మ వినయ్ రెడ్డి, అల్మాస్ పేట గౌతమ్, తొర్పునూరి సాయి, భాను ప్రసాద్, సాయి, మధు, సన్నీ, సంతోష్, పాలమాకుల సాయి తదితరులు పాల్గొన్నారు.

## యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

* **ఎస్సై సుధాకర్ రెడ్డి**



ప్రజాస్ఫూర్తి, కాప్రా : యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి, ఆరోగ్యకరమైన జీవనశైలిని అనుసరించాలని ఎస్సై సుధాకర్ రెడ్డి అన్నారు. శుక్రవారం కుషాయిగూడ పోలీస్ సిబ్బంది, యాంటీ డ్రగ్ సోల్జర్స్ వారి సంయుక్త ఆధ్వర్యంలో, తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ డిపార్ట్మెంట్ సహకారంతో ఈసీఐఎల్ లోని సాయి సుధీర్ డిగ్రీ , పీజీ కాలేజీలో డ్రగ్స్ , మత్తు పదార్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు డ్రగ్స్ వల్ల కలిగే ఆరోగ్య సమస్యలు, మానసిక ప్రభావాలు, సైబర్ నేరాల బారిన పడితే వచ్చే ఆర్థిక సమస్యలు , చట్టపరమైన పరిణామాలు, వాటి ప్రభావాలు, నివారణ చర్యల గురించి అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు చురుగ్గా పాల్గొని, వాటికి సంబంధించిన తమ సందేహాలను అడిగి తెలుసుకున్నారు. మత్తు పదార్థాల వ్యసనానికి గురైన వ్యక్తులను సమాజం నుంచి వేరుచేయకుండా, వారికి మానసిక భరోసా కల్పించి పునరావాసం కల్పించాలని సందేశం అందించారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, సైబర్ క్రైమ్ రాజు, యాంటీ నార్కోటిక్స్ సోల్జర్స్ సురేష్, మోహన్, ముక్కంటి, శ్రీశైలం, కాలేజీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కూకట్ పల్లి కోర్ట్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పి గోవర్ధన్ రెడ్డి



కూకటపల్లి, (ప్రజాస్ఫూర్తి) : కూకట్ పల్లి కోర్ట్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పి గోవర్ధన్ రెడ్డి వరుసగా మూడోసారి భారీ మెజార్టీతో గెలుపొందారు. గురువారం జరిగిన కూకట్ పల్లి కోర్ట్ బార్ అసోసియేషన్ ఎన్నికల్లో అధ్యక్షుడిగా పి గోవర్ధన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఏ.సుదర్శన్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా కె భీమయ్య , జాయింట్ సెక్రెటరీగా హర్షవర్ధన్ రెడ్డి, కోశాధికారిగా సైఫుల్ల షరీఫ్ లు ఎన్నికయ్యారు. లైబ్రరీసెక్రటరీగా ఎం.లావణ్య, మహిళ రిప్రజెంటేటివ్ గా బివిఎన్ లత, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీగా సురేష్ కమ్మెటలు తమ సమీప ప్రత్యర్థులపై గెలుపొందినట్లు ఎన్నికల అధికారి గా వ్యవహరించిన సీనియర్ న్యాయవాది సుభాష్ గుప్తా తెలిపారు. కాగా కార్యవర్గ సభ్యులుగా జె అఖిల రావు, సిహెచ్ అర్చన గౌడ్, కళ్యాణి, తన్నీరు శ్రీకాంత్,పద్మావతి, రామకృష్ణ, భాను ప్రసాద్ లు ఎన్నికైనట్లు వెల్లడించారు. కాగా నూతనంగా ఎన్నికైన కార్యవర్గం ఏప్రిల్ మొదటి వారంలో బాధ్యతలు స్వీకరించనుంది. నూతన కార్యవర్గం ఏడాది కాలం పదవిలో కొనసాగనున్నది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు న్యాయవాదుల సంక్షేమానికి, కోర్టులో కావాల్సిన సదుపాయాల కల్పనకు కృషి చేస్తామని తెలిపారు.

## కూకట్ పల్లి కోర్టు బార్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులుగా అర్చన శ్రీనివాస్ గౌడ్




కూకట్ పల్లి, ప్రజాస్ఫూర్తి : కూకట్ పల్లి కోర్టు బార్ అసోసియేషన్ ఎన్నికల్లో కార్యవర్గ సభ్యులు భారీ మేజార్టీతో ఘన విజయం సాధించిన న్యాయవాదిని చేదురుపల్లి అర్చన శ్రీనివాస్ గౌడ్ విజయం సాధించారు. ఈ సందర్భంగా తోటి న్యాయవాదులు, శ్రేయోభిలాషులు, బంధుమిత్రులు భారీగా తరలివచ్చి అర్చన శ్రీనివాస్ గౌడ్ కి శుభాకాంక్షలు తెలియజేశారు. ముందు ముందు ఎన్నో పదవులు అందుకోవాలని న్యాయం చేయడంలో స్వార్థంతో లేకుండా అందరికీ తగిన న్యాయం జరిగేట్టు చూడాలని అందరూ ఆశీస్సులు అందజేశారు.

# సూరారం డివిజన్ లో తాగునీటి సమస్యను పరిష్కరించాలి

*** సిపిఎం కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్**

కుత్బుల్లాపూర్, ప్రజాస్ఫూర్తి : సూరారం డివిజన్ షాపూర్ నగర్, సంజయ్ గాంధీ నగర్, కళావతి నగర్, న్యూ షాపూర్ నగర్ బస్తీలలో మంచినీటి సమస్యను పరిష్కరించాలని సిపిఎం కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్ అన్నారు. శుక్రవారం సిపిఎం పార్టీ కుత్బుల్లాపూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో సూరారం డివిజన్లో నెలకొన్న సమస్యలపై ఈనెల 7 నుండి 20 వరకు సర్వే నిర్వహించడం జరుగుందన్నారు. సర్వేలో ప్రధానంగా సూరారం డివిజన్లో షాపూర్ నగర్, న్యూ షాపూర్ నగర్, కళావతి నగర్, మార్కండేయ నగర్, నెహ్రూ నగర్ తదితర బస్తీలలో మంచినీటి సమస్య చాలా తీవ్రంగా ఉందన్నారు. బస్తీలలో భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటిపోయి ఇండ్లలో ఉన్న బోరు మోటర్ల లో నీళ్లు రావడంలేదని పూర్తిగా మంచినీళ్లపైనే ఆధార పడవలసి వస్తుందని మంచినీళ్లు కూడా వారానికి రెండుసార్లు మాత్రమే గంటలోపే వస్తున్నాయన్నారు. గతంలో కొద్దిగా మెరుగ్గా ఉండేదని ఎండాకాలం ప్రారంభంలోనే ఇంత ఇబ్బందిగా ఉంటే తర్వాత రోజులు ఊహించుకుంటేనే భయమేస్తుందని నెలకు వేల రూపాయలు ప్రైవేట్ ట్యాంకర్స్ కు పెట్టవలసి వస్తుందని మంచినీటి విడుదలలో



కూడ సమయపాలన పాటించడం లేదన్నారు. డివిజన్లో ఉన్న కొన్ని బస్తీలలో కనీసం ట్యాంకర్ కూడా వచ్చే పరిస్థితి లేదని మంచి నీళ్ల కోసం ప్రైవేటు డ్యూటీలు వదులుకొని ఎదురు చూడవలసి వస్తుందని అన్నారు మంచినీటి రిజర్వాయర్ కు కూతవేటు దూరంలో ఉన్న బస్తీలలోనే ఈ సమస్య ఉంటే మిగతా బస్తీలలో ఎలా ఉందో అధికారులు ప్రజా ప్రతినిధులు ఆలోచన చేయాలని అన్నారు మంచినీటి సమస్య ఈ బస్తీలలో పరిష్కారం కాకపోతే రానున్న కాలంలో సిపిఎం కుత్బుల్లాపూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున జనాల్ని సమీకరించి జలమండలి కార్యాలయాన్ని ముట్టడిస్తామని అన్నారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని డీజీఎం రాజు కి అందజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యులు పసుల అంజయ్య, రావుల స్వాతి, మల్లారెడ్డి యాదవ రెడ్డి కే శీను కే సత్యనారాయణ రమేష్ తదితరులు పాల్గొన్నారు

# పిఏసిఏస్ సర్వసభ్య సమావేశం




చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మండల కేంద్రంలోని పిఏసిఏస్ సర్వసభ్య సమావేశం చైర్మన్ చింతల దామోదర్ రెడ్డి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. సంఘం కార్యదర్శి రమేష్ జమ ఖర్చులు, అంచనా బడ్జెట్ ను చదివి వినిపించారు. ఈ సందర్భంగా సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. రూ.64లక్షల వ్యయంతో 750మెట్రిక్ టన్నుల గోదాం నిర్మాణం, రూ.16లక్షలతో ప్రహరీ గోడ నిర్మాణం, రూ.13లక్షలతో ఇస్ లింగోటం గ్రామంలో సంఘం భవన మరమ్మతులు, మండల కేంద్రంలో హార్టికల్చర్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. అనంతరం రైతు సమావేశ మందిరం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ముత్యాల నాగరాజు, పిఏసిఏస్ వైస్ చైర్మన్ చెన్నగోని అంజయ్య గౌడ్, సభ్యులు బోరెం నర్సిరెడ్డి, దూర్క కృష్ణ, పబ్బతి వెంకటేశం, దొడ్డి శ్రీశైలం, బొడ్డు పద్మ, దుబ్బాక శశిధర్ రెడ్డి, దౌడి బాలరాజు, బాతరాజు సాయిలు, మాజీ జెడ్పిటిసి పెద్దిటి బుచ్చిరెడ్డి, మాజీ పిఏసిఏస్ చైర్మన్ చీదిక సంజీవరెడ్డి, మాజీ ఎంపిటీసీ బూరుగు కృష్ణారెడ్డి, మాజీ డైరెక్టర్లు రాంరెడ్డి, యాదయ్య, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, నిరంజన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## నారాయణకు..
## చౌటుప్పల్ లో అనుమతి ఇవ్వద్దని వినతి

**- అడ్మిషన్ల పేరుతో అత్యధిక డబ్బులు పెట్టి మోసపోవద్దు**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: నారాయణ పాఠశాలకు చౌటుప్పల్ లో అనుమతి ఇవ్వొద్దని కోరుతూ చౌటుప్పల్ ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు తీగుళ్ళ శ్రీనివాస్ ఆధ్వర్యంలో మండల విద్యాశాఖ కార్యాలయంలో శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తీగుళ్ళ శ్రీనివాస్ మాట్లాడుతూ ఎలాంటి అనుమతులు లేకుండానే నారాయణ పాఠశాల అడ్మిషన్ల పేరుతో క్యాంపెయిన్ చేస్తున్నారని పేర్కొన్నారు. తల్లిదండ్రుల వద్ద నుంచి డబ్బులు వసూలు చేసేందుకు పాఠశాల ప్రారంభం కాకముందే అడ్మిషన్ల ప్రారంభించిందని, అత్యధిక డబ్బులు కట్టి మోసపోవద్దని కోరారు. ఇలాంటి పాఠశాలలు పూర్తిగా నడుస్తాయో, మధ్యలో ఆగిపోతే తెలియని పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. ఇలాంటి పాఠశాలలో మీ పిల్లల అడ్మిషన్లు వేసి వాళ్ళ భవిష్యత్తుతో చెలగాటమాడొద్దని సూచించారు. విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే అన్ని పాఠశాలలో ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే ఫీజు నియంత్రణ చట్టం అమలు చేయాలని, పేద మధ్యతరగతి కుటుంబాల విద్యార్థులు చదువుకునేలా ఈచట్టం అమల్లోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు దాసరి ప్రకాష్, మండల ఉపాధ్యక్షుడు బండారు విక్రమ్ ,వరుణ్ నాయకులు అజయ్, సాయి కుమార్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ ను కలిసిన మాదిగ చైతన్య సంక్షేమ సంఘం సభ్యులు

కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి ) : మాదిగ చైతన్య సంక్షేమ సంఘం నూతనంగా ఎన్నికైన సందర్భంగా శుక్రవారం పేట్ బషీరాబాద్ లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బీఆర్ఎస్ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ ను మాదిగ చైతన్య సంక్షేమ సంఘం సభ్యులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నూతన కమిటీని అభినందిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు.
ఈ కార్యక్రమంలో నూతన కమిటీ అధ్యక్షులు జి.బలరాం, ప్రధాన కార్యదర్శి బి.బాలరాజు, కోశాధికారి జి.పరమేష్, పి.సాయిలు, కె.యాదగిరి,



ఏ.అంజనేయులు, కె.గోపాల్ జీ.యాదగిరి ఏ.సత్యనారాయణ, డప్పు రవీందర్, పి. శ్రీహరి జీ.రామ్మూర్తి, కే.రాజు, జి. ఉపేందర్, ఏ.చింటూ, ఏ.వెంకటేష్, కమిటీ గౌరవ సభ్యులు, ఇతర కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

## అమీన్‌పూర్‌లో విషాదం..
# ఒకే ఇంట్లో ముగ్గురు చిన్నారుల అనుమానాస్పద మృతి




జిన్నారం: సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్‌లో విషాదం చోటుచేసుకుంది. అనుమానాస్పద రీతిలో ఒకే ఇంట్లో ముగ్గురు చిన్నారులు మృతిచెందారు. తల్లి తీవ్రమైన కడుపునొప్పితో ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ప్రస్తుతం ఆమె పరిస్థితి నిలకడగా ఉంది. స్థానిక సీఐ నరేశ్ కథనం ప్రకారం.. అమీన్‌పూర్‌లోని రాఘవేంద్ర కాలనీలో చెన్నయ్య, ఆయన భార్య రజిత తమ ముగ్గురు పిల్లలు సాయికృష్ణ (12), మధుప్రియ (10), గౌతమ్ (8)తో కలిసి నివాసముంటున్నారు. చెన్నయ్య వాటర్ ట్యాంకర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. గురువారం రాత్రి 9 గంటల సమయంలో భార్యాభర్తలతో పాటు ముగ్గురు పిల్లలు ఇంట్లోనే భోజనం చేశారు. చెన్నయ్య అన్నం, పప్పు తిన్నాడు. భార్య, ముగ్గురు పిల్లలు పెరుగన్నం తిన్నారు. భోజనం తర్వాత చెన్నయ్య ట్యాంకర్ నడిపేందుకు చందానగర్ వెళ్లాడు. రాత్రి 11 గంటల ప్రాంతంలో తిరిగి ఇంటికి వచ్చాడు. రాజిత తలుపులు తెరవగా.. పిల్లలు నిద్రపోతున్నారు. శుక్రవారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో రాజితకు తీవ్రమైన కడుపునొప్పి రావడంతో స్థానికుల సహాయంతో చెన్నయ్య ఆమెను ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించాడు. ఆ తర్వాత పిల్లలను పరిశీలించగా.. అప్పటికే ముగ్గురూ మృతిచెందినట్లు గుర్తించారు. దీంతో ఈ ఘటనపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. చెన్నయ్యది రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం మెడకపల్లి. ఉపాధి కోసం గత కొంతకాలంగా ఆయన అమీన్‌పూర్‌లో ఉంటున్నాడు. చిన్నారుల మృతిపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.



# పాలమూరు ఎత్తిపోతలకు జాతీయ హోదా కుదరదు: కేంద్రం

దిల్లీ: పాలమూరు ఎత్తిపోతల పథకానికి జాతీయ హోదా కల్పించాలంటూ తెలంగాణ ప్రభుత్వం చేసిన ప్రతిపాదనను కేంద్ర ప్రభుత్వం తిరస్కరించింది. కృష్ణానదీ జలాలపై తెలంగాణ, ఏపీ మధ్య వివాదం కోర్టులో ఉన్న నేపథ్యంలో జాతీయ హోదా సాధ్యం కాదని జల్‌శక్తి శాఖ స్పష్టం చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనలను తిరిగి పంపినట్లు లోక్‌సభకు కేంద్రం వెల్లడించింది. 2024 డిసెంబర్‌లోనే ఈ ప్రక్రియ చేపట్టినట్లు తెలిపింది. ఈ మేరకు ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అడిగిన ప్రశ్నకు జల్‌శక్తిశాఖ లిఖితపూర్వక సమాధానం ఇచ్చింది.

# భర్త వర్ధంతి సభలో భావోద్వేగాలకు గురైన మంత్రి సీతక్క

*** భర్త రాము వర్ధంతిలో సీతక్క కన్నీటి పర్యంతం**

*** సీతక్కను ఓదార్చిన విమలక్క**


*** మోకాళ్లపల్లిలో జరిగిన రాము వర్ధంతి సభ**




తెలంగాణ పంచాయతీరాజ్, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి సీతక్క తన జీవితంలోని కష్టాలను, ప్రజలకు సేవ చేయాలనే తన సంకల్పాన్ని గుర్తు చేసుకున్నారు. తన భర్త కుంజ రాము వర్ధంతి సభలో ప్రసంగిస్తూ, సీతక్క ఒక్కసారిగా భావోద్వేగానికి గురయ్యారు. భర్త స్మృతులతో కదిలిపోయారు. కన్నీటిపర్యంతమైన ఆమెను విమలక్క ఓదార్చారు. ఒకప్పుడు ఉద్యమంలో పని చేస్తున్న సమయంలో ఎన్‌కౌంటర్ నుంచి తృటిలో తప్పించుకున్నానని, అది తనకు పునర్జన్మ అని మంత్రి సీతక్క అన్నారు. ఈ జన్మలో పేదలు, ఆదివాసీలు, అట్టడుగు వర్గాల హక్కుల కోసం తన చివరి శ్వాస వరకు పోరాడతానని ఆమె పేర్కొన్నారు. మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం మోకాళ్లపల్లిలో జరిగిన ఈ కార్యక్రమంలో, సీతక్క తన కుమారుడు సూర్య, కోడలు కుసుమాంజలితో కలిసి భర్త కుంజ రాము స్తూపం వద్ద నివాళులర్పించారు. రాము 17 ఏళ్ల వయసులోనే ఉద్యమంలో చేరి ఎన్నో పోరాటాలలో పాల్గొన్నారని, ఆయన ఎల్లప్పుడూ అట్టడుగు వర్గాల అభివృద్ధికి పాటుపడ్డారని ఆమె గుర్తు చేసుకున్నారు. రాము నేర్పిన విలువలు, నైతికతతోనే తాను ప్రజల కోసం పనిచేస్తున్నానని సీతక్క అన్నారు.

## దర్యాప్తునకు సహకరించండి..
# నటి విష్ణుప్రియకు హైకోర్టు ఆదేశం

హైదరాబాద్: బెట్టింగ్ యాప్స్ కేసులో నటి విష్ణుప్రియ దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టులో విచారణ జరిగింది. మియాపూర్ పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని నటి కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఎఫ్ఐఆర్ కొట్టివేయడానికి, దర్యాప్తుపై స్టే విధించేందుకు ఉన్నత న్యాయస్థానం నిరాకరించింది. దర్యాప్తునకు సహకరించాలని విష్ణుప్రియను ఆదేశించిన కోర్టు.. చట్ట ప్రకారం ముందుకెళ్లాలని పోలీసులకు స్పష్టం చేసింది. బెట్టింగ్ యాప్స్‌పై ప్రచారం చేసిన పలువురు నటీనటులు, సోషల్ మీడియా ఇన్ ఫ్లుయెన్సర్లపై మియాపూర్



పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే.

# ఈ పదార్థాలతో.. వేసవిలో చల్లగా..!

**వేసవిలో పెరిగే ఉష్ణోగ్రతల వల్ల శరీరం డీహైడ్రేషన్‌కు గురై వడదెబ్బ బారిన పడే అవకాశం ఉంటుంది. మరి, అలా జరగకుండా ఉండాలంటే ఈ కాలంలో శరీరాన్ని చల్లగా ఉంచుకోవాలి. అందుకు కొన్ని ఆహార పదార్థాలు ఉపయోగపడతాయని చెబుతున్నారు పోషకాహార నిపుణులు. ఈ క్రమంలో శరీరాన్ని చల్లగా ఉంచుకోవడానికి ఎలాంటి పదార్థాలు తీసుకోవాలో తెలుసుకుందాం రండి..**



### ఈ పండ్లతో..

వేసవి వేడి నుంచి తట్టుకోవడానికి ఈ కాలంలో వచ్చే కొన్ని పండ్లు ఎంతగానో ఉపయోగపడతాయి. ముఖ్యంగా తాటి ముంజలు, పుచ్చకాయ, కర్బూజ.. వంటి పండ్లు అటు రుచికి రుచితో పాటు ఇటు శరీరానికి చలువను అందిస్తాయి.

### డీహైడ్రేషన్ బారిన పడకుండా..

వేసవిలో అధిక ఉష్ణోగ్రతల వల్ల శరీరం డీహైడ్రేషన్ బారిన పడకుండా కాపాడుకోవడం చాలా ముఖ్యం. అందుకోసం ఎక్కువ మొత్తంలో నీళ్లు తాగడం తప్పనిసరి. అయితే నీళ్లతో పాటు నిమ్మరసం, లెమన్‌గ్రాస్ టీ, మిల్క్‌షేక్, కోకమ్ పండుతో చేసిన షర్బత్, గుల్‌కంద్, ఆమ్ పన్నా, సత్తు డ్రింక్ (శెనగలుబెల్లం కలిపి సత్తుపిండితో చేసే పానీయం), అంబలి.. మొదలైనవి తీసుకోవాలి. ఇవి రుచికరంగా ఉండడమే కాదు.. వీటితో శరీరానికి ఎక్కువ మొత్తంలో నీరు కూడా అందుతుంది.

### భోజనానికి ఇవి..

డ్రింక్స్, పండ్లే కాదు.. మనం రోజూ రెండు పూటలా తీసుకునే భోజనం విషయంలోనూ పలు మార్పులు చేర్పులు చేసుకోవాలి. పెరుగన్నం అప్పడాలు కలిపి తీసుకోవడం, జొన్నల్ని బాగా ఉడికించుకొని సబ్జీ (అన్ని కూరగాయలను కలిపి చేసే కర్రీ)తో కలిపి తినడం, గంజి, పోహా, పెరుగు, అన్నం మామిడికాయ పచ్చిపులుసు.. ఇలాంటి ఫుడ్ కాంబినేషన్స్‌ని భోజనంలో భాగంగా తీసుకోవాలి. ఫలితంగా ఇవి అధిక వేడి నుంచి శరీరాన్ని కాపాడి శరీరానికి చల్లదనాన్ని అందిస్తాయి.








# పనీర్ నీటితో.. ఇలా కూడా..!



**ఇంట్లో పాలు విరిగిపోతే పనీర్, కలాకండ్.. వంటి పదార్థాలు తయారుచేసుకుంటాం. అయితే ఈ క్రమంలో వడకట్టిన నీటిని కొంతమంది బయట పడేస్తుంటారు. కానీ ప్రొటీన్లు, ఇతర పోషకాలు నిండి ఉన్న ఈ నీటిని ఇంట్లో పలు రకాలుగా ఉపయోగించుకోవచ్చంటున్నారు నిపుణులు. మరి, అదెలాగో తెలుసుకుందాం రండి..**

చపాతీ పిండి తడపడానికి సాధారణ నీటిని ఉపయోగిస్తాం. అయితే పనీర్ నీటిని కూడా ఇందుకోసం వాడుకోవచ్చు. తద్వారా చపాతీ/పూరీ.. వంటివి మెత్తగా రావడంతో పాటు వీటి రుచి కూడా పెరుగుతుంది.

* బేకింగ్ వంటకాలు తయారుచేసుకునే క్రమంలో.. పిండిని తడుపుకోవడానికీ ఈ నీటిని వినియోగించుకోవచ్చు.
* కూరల్లో గ్రేవీ కోసం కొన్ని నీళ్లు పోయడం మనకు అలవాటే! అయితే ఈసారి సాధారణ నీటికి బదులు పనీర్ నీటిని పోసి చూడండి.. అటు రుచీ పెరుగుతుంది.. ఇటు అందులోని పోషకాలూ శరీరానికి అందుతాయి.
* అలాగే కొన్ని కూరలు, ఇతర వంటకాల తయారీలో భాగంగా పులుపు ఎక్కువైతే.. కొద్దిగా ఈ నీటిని కలపచ్చు.
* పండ్లుకాయగూరలతో చేసిన జ్యూసులు, స్మూతీస్.. వంటివి తయారుచేసుకునేటప్పుడు నీటికి బదులుగా



పనీర్ నీటిని ఉపయోగిస్తే.. రుచి మరింతగా పెరుగుతుంది. వీటిలో చక్కెర వేసుకోకపోయినా తియ్యదనం వస్తుంది.

* పాస్తా, నూడుల్స్, బంగాళాదుంపలు, బియ్యం, ఇతర కాయగూరలు.. వంటివి ఉడికించే క్రమంలోనూ పనీర్ నీటిని వినియోగించుకోవచ్చు. అలాగే కొన్ని రకాల పప్పుల్ని కూడా ఈ నీటిలో నానబెట్టుకోవచ్చుట. తద్వారా ఈ నీటిలోని పోషకాలు ఆయా పదార్థాల్లో చేరి ఒంటికి పడతాయి.
* ఉప్మా వంటివి తయారుచేసే క్రమంలో సాధారణ నీటితో పాటు పనీర్ నీటిని కూడా పోస్తే దాని రుచి పెరుగుతుంది.
* ప్రొటీన్లు, ఇతర పోషకాలు నిండి ఉన్న ఈ పనీర్ నీటిని మొక్కలకూ పోయచ్చు. అయితే సాధారణ నీటితో కలిపి మాత్రమే వాడాలి.
* ఫేస్‌ప్యాక్స్, హెయిర్ మాస్కుల్లోనూ ఈ నీటిని వాడచ్చు. అలాగే ఈ నీటితో జుట్టును కండిషనింగ్ చేసుకుంటే కేశాలు పట్టులా తయారవుతాయి. ఇందులోని ప్రొటీన్ జుట్టు ఆరోగ్యానికీ మేలు చేస్తుంది. అయితే ఈ చిట్కా పాటించిన తర్వాత జుట్టు జిడ్డుగా అనిపిస్తే.. గాఢత తక్కువగా ఉండే షాంపూతో తలస్నానం చేయాలి.
* కొంతమంది ఇంట్లోనే కంపోస్ట్ ఎరువులు తయారుచేసుకుంటారు. ఈ క్రమంలో పనీర్ నీటిని అందులో పోస్తే.. ఎరువు లోని పోషకాల శాతాన్ని పెంచచ్చు.



సీజన్‌ను బట్టి మన జీవన శైలిలోనూ కొన్ని మార్పులు చేసుకోవాలి. ప్రత్యేకించి వేసవి కాలంలో శరీరానికి చలువనిచ్చే పండ్లను, కూరగాయలను ఆహారంలో తప్పకుండా భాగం చేసుకోవాల్సిందే. కాలానుగుణంగా లభించే పండ్లను అధికంగా తీసుకోవడం వల్ల శరీరంలో నీటి స్థాయిలు పెరగడమే కాకుండా కాలక్రమేణా రోగనిరోధక శక్తి కూడా పెరుగుతుంది. ఇక ఎండ వేడిమి నుంచి శరీరానికి తక్షణ శక్తినందించే పండ్లు ఎన్నో ఉన్నప్పటికీ కర్బూజ ప్రత్యేకత వేరు.

## పోషకాల గని.. కర్బూజ!

### పోషకాలు పుష్కలం!

* ఈ పండులోని వివిధ పోషకాలు శరీరంలో నీటి స్థాయిలను పెంచి డీహైడ్రేట్ కాకుండా కాపాడతాయి.
* ఫైబర్ మలబద్ధకం, మూత్ర సంబంధ సమస్యలు, అలసట, రక్తపోటు సమస్యల నుంచి ఉపశమనం కలిగిస్తుంది.
* ఫోలిక్ యాసిడ్ యాంటీ కోయాగ్యులెంట్ ఫ్యాక్టర్‌గా పనిచేసి రక్తనాళాల్లో గడ్డకట్టిన రక్తాన్ని కరిగించడంలో సహాయపడుతుంది. కండరాల నొప్పులు కూడా తగ్గిపోతాయి.
* కర్బూజా లో విటమిన్‌ఎ కూడా అధికంగా ఉంటుంది. ఇది కంటి సమస్యలను దూరం చేయడమే కాకుండా కంటి చూపు సామర్థ్యాన్ని పెంచుతుంది.
* క్యాలరీలు తక్కువగా ఉండే ఈ పండును ఆహారంలో భాగం చేసుకుంటే చర్మ సంబంధ సమస్యలు దూరమవడంతో పాటు అధిక బరువు కూడా నియంత్రణలోకి వస్తుంది.

# ప్రపంచాన్ని ఏలుతున్న పతంజలి..

## అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు




**న్యూఢిల్లీ:** పతంజలి కేవలం ఒక బ్రాండ్ మాత్రమే కాదు.. ఆధ్యాత్మిక, సాంస్కృతిక ఉద్యమం కూడా. ఇది లక్షలాది మంది ప్రజల జీవితాలను ఆరోగ్యంగా, సమతుల్యంగా మార్చడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తోంది. యోగా గురువు స్వామి రామ్‌దేవ్, ఆచార్య బాలకృష్ణ నాయకత్వంలో పతంజలి భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను పునరుద్ధరించడమే కాకుండా ప్రపంచ స్థాయిలో వాటికి గుర్తింపును కూడా ఇచ్చింది.

అంతర్జాతీయ బ్రాండ్లు లాభనష్టాలపై మాత్రమే దృష్టి సారిస్తుంటాయి. కానీ పతంజలి తన బ్రాండ్‌లో భారతీయ ఆధ్యాత్మిక, సాంస్కృతిక విలువలను కలుపుకుంటుంది. పతంజలి స్వావలంబనకు ప్రాధాన్యత ఇస్తుంది. పాశ్చాత్య వినియోగదారుల మాదిరిగా కాకుండా, పతంజలి భారతదేశ సాంప్రదాయ జ్ఞానాన్ని ప్రోత్సహిస్తుంది.

### పతంజలి ఆధ్యాత్మిక లక్ష్యం:

స్వామి రాందేవ్ నాయకత్వంలో పతంజలి యోగపీఠ్ యోగా, ఆయుర్వేదం, ప్రకృతి వైద్యాన్ని ప్రజలకు వ్యాప్తి చేయడానికి కృషి చేసింది. యోగా ద్వారా శరీరాన్ని మనస్సును ఆరోగ్యంగా ఉంచుకునే సంప్రదాయాన్ని ఆయన ఆధునిక శాస్త్రంతో కలిపారు. దీని నుండి ప్రపంచవ్యాప్తంగా ప్రజలు ప్రయోజనం పొందుతున్నారు. పతంజలి యోగా శిబిరాలు, టీవీ కార్యక్రమాలు లక్షలాది మంది సహజమైన, సమతుల్య జీవితాన్ని గడపడానికి ప్రేరణనిచ్చాయి.

### సాంస్కృతిక వారసత్వాన్ని రక్షించడం:

గత కొన్ని దశాబ్దాలుగా పాశ్చాత్య జీవనశైలి ప్రభావం కారణంగా భారతదేశ సాంప్రదాయ వైద్య విధానాలు, ఆరోగ్య పద్ధతులు వెనుకబడిపోయాయి. కానీ పతంజలి ఆయుర్వేదం, యోగా, ప్రకృతి వైద్యాన్ని మళ్లీ ప్రాచుర్యంలోకి తీసుకురావడం ద్వారా భారతీయ సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడటానికి కృషి చేసింది. ఆయుర్వేద మందులు, మూలికా ఉత్పత్తులు, సహజ జీవనశైలిని ప్రోత్సహించడం ద్వారా పతంజలి తన భారతీయ మూలాలను బలోపేతం చేసుకుంది.

### ఆధునిక ఆరోగ్యం, జీవనశైలిపై ప్రభావం:

స్వామి రాందేవ్ యోగా, ఆయుర్వేదాన్ని ప్రోత్సహించడమే కాకుండా ప్రపంచవ్యాప్తంగా ఆరోగ్యం, సహజ జీవనశైలి భావనను కూడా ప్రచారం చేశారు. ఆయన బోధనలు శారీరక ఆరోగ్యాన్ని మెరుగుపరచడమే కాకుండా మానసిక శాంతి, ఆధ్యాత్మిక పురోగతికి మార్గాన్ని కూడా చూపుతాయి. వేలాది మంది అతని యోగా సెషన్లకు హాజరవుతారు. మధుమేహం, రక్తపోటు, ఊబకాయం, ఇతర వ్యాధులలో మెరుగుదల చూస్తారు.

### పతంజలి పాత్ర ప్రత్యేకత:

పతంజలి భారత మార్కెట్‌లోనే కాకుండా అంతర్జాతీయ స్థాయిలో కూడా తన ఉనికిని చాటుకుంది. అమెరికా, కెనడా, బ్రిటన్, ఆస్ట్రేలియా వంటి దేశాలలో యోగా, ఆయుర్వేదం గురించి అవగాహన పెంచడంలో పతంజలి ముఖ్యమైన పాత్ర పోషించింది. పతంజలి ఉత్పత్తులు ఇప్పుడు 20కి పైగా దేశాలలో అందుబాటులో ఉన్నాయి. ఇది భారతీయ సంస్కృతి, జీవనశైలిని ప్రోత్సహించడానికి ఒక శక్తివంతమైన మాధ్యమంగా మారింది.

### వ్యాపారానికి అతీతంగా సామాజిక మార్పు:

పతంజలి కేవలం వ్యాపార సంస్థ మాత్రమే కాదు. అది ఒక సామాజిక, ఆధ్యాత్మిక ఉద్యమం కూడా. స్వామి రాందేవ్, ఆచార్య బాలకృష్ణ తమ సంపాదనలో ఎక్కువ భాగాన్ని సామాజిక సంక్షేమంలో పెట్టుబడి పెట్టారు. పతంజలి యోగాపీఠ్, ఇతర సంస్థల ద్వారా పేదలకు విద్య, ఆరోగ్యం, సహాయం కోసం అనేక పథకాలు అమలు చేస్తోంది. పతంజలి భారతీయ సంస్కృతి, యోగా, ఆయుర్వేదాన్ని పునరుద్ధరించడమే కాకుండా దానికి ప్రపంచ గుర్తింపును కూడా ఇచ్చింది. దాని ఆధ్యాత్మిక, సాంస్కృతిక సహకారాలు లక్షలాది మంది ప్రజల జీవితాలను మార్చాయి. రాబోయే సంవత్సరాల్లో భారతీయ విలువలను బలోపేతం చేస్తూనే ఉంటాయి.

లిమిట్ క్రాస్ అయితే బాదుడే..

# విత్‌డ్రాపై రూ.23 ఛార్జీ

## మే 1 నుంచి పెరుగుతున్న ఏటీఎం విత్‌డ్రా ఛార్జీలు

### రూ.2 పెంచుతూ ఆర్‌బీఐ ప్రకటన



**న్యూఢిల్లీ:** దేశంలో ఇప్పుడు చాలా మంది డిజిటల్ పేమెంట్‌లే చేస్తున్నారు. అయినా ఇప్పటికీ క్యాష్ ట్రాన్సాక్షన్లపై ఆధారపడే వాళ్లు కూడా ఎక్కువగానే ఉన్నారు. ఇకపై అందరూ ఏటీఎంకు వెళ్లి మనీ డ్రా చేసే ముందు ఒకసారి ఆలోచించాలి! ఎందుకంటే 2025 మే 1 నుంచి ఏటీఎం మనీ విత్‌డ్రా ఛార్జీలు పెరుగుతున్నాయి. ఒక నెలలో ఉచిత ట్రాన్సాక్షన్లు పూర్తయ్యాక చేసే విత్‌డ్రాపై విధించే ఫీజు రూ.2 పెరుగుతుందని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రకటించింది. ఇంతకుముందు అదనంగా చేసే విత్‌డ్రా ట్రాన్సాక్షన్‌లకు రూ.21 ఛార్జీ వసూలు చేసేవారు. ఇప్పుడు ఈ మొత్తం రూ.23కి పెరిగింది. కస్టమర్లకు గుడ్‌న్యూస్ ఏంటంటే, ఇప్పటికీ ప్రతి నెలా కొన్ని ఉచిత ట్రాన్సాక్షన్లు పొందుతారు. అందరికీ సొంత బ్యాంకు ఏటీఎంలలో నెలకు ఐదు ఉచిత ట్రాన్సాక్షన్లు ఉంటాయి. క్యాష్ విత్‌డ్రాతో పాటు బ్యాలెన్స్ చెక్ చేయడం వంటివి కూడా ట్రాన్సాక్షన్లుగా పరిగణిస్తారు. ఇతర బ్యాంకుల ఏటీఎంలో అయితే మెట్రో సిటీల్లో మూడు ఫ్రీ ట్రాన్సాక్షన్లు ఉంటాయి. ఇతర ప్రాంతాల్లో ఐదు ఉచిత ట్రాన్సాక్షన్లు లభిస్తాయి. ఈ లిమిట్‌ని దాటిన తర్వాత, అదనంగా చేసే ప్రతి ట్రాన్సాక్షన్‌కి రూ.23 ఫీజు వర్తిస్తుంది.

### ఎందుకు పెరుగుదల..?

విత్‌డ్రా ఫీజులను పెంచే నిర్ణయం ఆర్‌బీఐ, ఏటీఎం నెట్‌వర్క్‌లను నిర్వహించే నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా తీసుకున్నాయి. ఇవి ఏటీఎం ఇంటర్‌ఛేంజ్ ఫీజును రూ.2 పెంచడానికి అంగీకరించాయి. డబ్బు డ్రా చేయడానికి మరొక బ్యాంకు ఏటీఎంని ఉపయోగించినప్పుడు కస్టమర్ సొంత బ్యాంక్ చెల్లించేది ఇంటర్‌చేంజ్ ఫీజు. ఉదాహరణకు ఓ వ్యక్తికి ఐసీఐసీఐలో అకౌంట్ ఉంది. డబ్బు విత్‌డ్రా చేయడానికి అందుబాటులో ఉన్న ఎస్‌బీఐ ఏటీఎం ఉపయోగించాడు. కాబట్టి ఎస్‌బీఐ బ్యాంకు, ఐసీఐసీఐకి ఇంటర్‌ఛేంజ్ ఫీజును చెల్లిస్తుంది. 2024 జూన్‌లో ఏటీఎం ఆపరేటర్లు రూ.23 ఫీజును డిమాండ్ చేశారు. పాత రేట్లు తమ వ్యాపారాన్ని లాభదాయకంగా నడపడానికి సరిపోవని చెప్పారు. దీన్ని అధ్యయనం చేయడానికి ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ (ఐబీఏ), స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ అధికారులతో ఆర్‌బీఐ ఒక కమిటీని ఏర్పాటు చేసింది. ఏటీఎం నిర్వహణ ఖర్చులు భరించడానికి ఫీజులు పెంచాలని కమిటీ సూచించింది.



# ఆర్సీబీ ఆల్‌రౌండ్ షో..

## సూపర్ కింగ్స్ కంచుకోటలో ఘన విజయం



**చెన్నై:** ఐపీఎల్ 18వ సీజన్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు రెండో విజయం సాధించింది. 17 ఏళ్లుగా చెపాక్ స్టేడియంలో ఓడిపోతూ వస్తున్న ఆర్సీబీ ఎట్టకేలకు జయభేరి మోగించింది. రజత్ పాటిదార్(51) మెరుపులకు జోష్ హేజిల్‌వుడ్(3-21), యశ్ దయాల్(2-18) సూపర్ బౌలింగ్ తోడవ్వడంతో సీఎస్కేకు ఓటమిని రుచిచూపింది. ఆది నుంచి తడబడిన చెన్నై జట్టు 197 పరుగుల ఛేదనలో 146కే పరిమితం అయింది. తొలి ఐపీఎల్ టైటిల్ కోసం నిరీక్షిస్తున్న బెంగళూరు మరింత ఆత్మవిశ్వాసం మూటగట్టుకుంది.

సొంతమైదానంలో సింహంలా గర్జించే చెన్నై సూపర్ కింగ్స్ ఓటమి పాలైంది. ఛేదనలో సూపర్ కింగ్స్‌కు ఆదిలోనే పెద్ద షాక్ తగిలింది. తన మొదటి ఓవర్లోనే హేజిల్‌వుడ్ రెండు వికెట్లు తీసి సీఎస్కేను దెబ్బకొట్టాడు. మొదట ఓపెనర్ రాహుల్ త్రిపాఠి(5)ను.. ఆఖరి బంతికి రుతురాజ్ గైక్వాడ్(0)ను డకౌట్‌గా డగౌట్‌కు చేర్చాడు. దాంతో, 8 పరుగులకే ఆతిథ్య జట్టు పీకల్లోతు కష్టాల్లో పడింది. ఓ వైపు వికెట్లు పడుతున్నా ఓపెనర్ రచిన్ రవీంద్ర(41) ఆత్మవిశ్వాసంగా ఆడాడు.

అయితే. భువనేశ్వర్ బౌలింగ్‌లో రివ్యూ తీసుకొని దీపక్ హుడా(4)లు వికెట్ సాధించింది బెంగళూరు. ఆ తర్వాత వచ్చిన సామ్ కరన్(4) ఎక్కువ సేపు క్రీజులో నిలవలేదు. ఇంప్యాక్ట్ ప్లేయర్ శివం దూబే(22) హడలెత్తించినా.. యశ్ దయాల్ తన 13వ ఓవర్లో డేంజరస్ రచిన్, దూబే.. ఇద్దరినీ బౌల్డ్ చేసి సీఎస్కేను ఓటమి అంచుల్లోకి నెట్టాడు. దాంతో, 13 ఓవర్లకు సీఎస్కే స్కోర్.. 81-6. కాసేపటికే అశ్విన్(1) కూడా ఔట్ కావడంతో సీఎస్కే ఓటమి ఖాయమైంది. ఆఖర్లో.. జడేజా(25), ధోనీ(30)లు ధాటిగా ఆడారు. 20వ ఓవర్లో ధోనీ రెండు సిక్సర్లు, ఫోర్ బాదినా జట్టును గెలిపించలేకపోయాడు.

### రజత్ సూపర్ హాఫ్ సెంచరీ

చెపాక్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన రాయల్ చాలెంజర్స్ బెంగళూరు భారీ స్కోర్ కొట్టింది. కెప్టెన్ రజత్ పాటిదార్(51) సూపర్ హాఫ్ సెంచరీతో కదం తొక్కాడు. చెన్నై సూపర్ కింగ్స్ బౌలర్లను దీటుగా ఎదుర్కొన్న పాటిదార్ విరాట్ కోహ్లీ(31)తో విలువైన భాగస్వామ్యం నెలకొల్పాడు. ఓపెనర్ ఫిలిప్ సాల్ట్(32), టిమ్ డేవిడ్(22)లు ధనాధన్ ఆడారు. రవీంద్ర జడేజా బౌలింగ్‌లో 4, 4, 6 బాదడంతో పవర్ ప్లేలో ఆర్సీబీ వికెట్ నష్టానికి 56 పరుగులు చేసింది.

ఆ తర్వాత నూర్ అహ్మద్ విజృంభణతో విరాట్, లివింగ్‌స్టోన్ పెవిలియన్ చేరారు. పాటిదార్, కృనాల్ పాండ్యాలు వెనువెంటనే ఔటయ్యారు. సామ్ కరన్ వేసిన 20వ ఓవర్లో టిమ్ డేవిడ్ (22 నాటౌట్ ) రెచ్చిపోయాడు. వరుసగా మూడు సిక్సర్లు బాది ఆర్సీబీ స్కోర్ 190 దాటించాడు. నిర్ణీత ఓవర్లలో బెంగళూరు 7 వికెట్ల నష్టానికి 196 పరుగులు చేసింది.

# ఐపీఎల్ షెడ్యూల్‌లో మార్పు..





**ముంబై:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ 18వ సీజన్ షెడ్యూల్‌లో స్వల్ప మార్పులు జరుగనున్నాయి. కోల్‌కతా నైట్ రైడర్స్, లక్నో సూపర్ జెయింట్స్ జట్ల మధ్య జరాగాల్సిన మ్యాచ్ తేదీ మారనుంది. షెడ్యూల్ ప్రకారం ఏప్రిల్ 6 ఆదివారం ఈడెన్ గార్డెన్స్‌లో ఈ రెండు జట్లు తలపడాల్సి ఉంది. అయితే.. అదే రోజున శ్రీరామనవమి వేడుకలు ప్రారంభం కానున్నాయి. దాంతో, అటు శ్రీరాముడి శోభాయాత్ర, ఇటు మ్యాచ్‌కు పోలీసులు భద్రత కల్పించాల్సి వస్తుంది.

అందుకే.. కోల్‌కతా పోలీసులు బెంగాల్ క్రికెట్ సంఘానికి ఓ లేఖ రాశారు. స్టేడియం వద్ద భద్రతకు సిబ్బంది కొరత ఏర్పడుతుందని.. దయచేసి మ్యాచ్ తేదీ మార్చాలని ఆ లేఖలో కోరారు. అందుకని ఆ రోజు జరగాల్సిన మ్యాచ్‌ను మ్యాచ్‌ను ఏప్రిల్ 8వ తేదీన నిర్వహించేందుకు క్యాబ్ అంగీకరించింది. ఈ మేరకు శుక్రవారం ఐపీఎల్ యాజమాన్యం ఓ ప్రకటన విడుదల చేసింది. షెడ్యూల్ ప్రకారం ఏప్రిల్ 6వ తేదీన డబుల్ హెడర్ మ్యాచ్‌లు ఉన్నాయి. మధ్యాహ్నం కోల్‌కతా, లక్నోలు తలపడాల్సి ఉంది. కానీ, తేదీ మారడంతో .. ఆ రోజు రాత్రి 730 గంటలకు సన్‌రైజర్స్ హైదరా బాద్, గుజరాత్ టైటన్స్ మ్యాచ్ యథావిధిగా జరుగనుంది. 17వ సీజన్‌లో కూడా పండుగల సందర్భంలో మ్యాచ్ తేదీలను మార్చిన సంగతి తెలిసిందే.



# మాజీ పేసర్ కన్నుమూత

## ఆ వరల్డ్ కప్‌తో ముగిసిన కెరీర్ ..!

**ఇంగ్లండ్:** ప్రపంచ క్రికెట్‌లో విషాదం నెలకొంది. ఇంగ్లండ్ మాజీ క్రికెటర్ పీటర్ లెవర్ కన్నుమూశాడు. 84 ఏళ్ల వయసున్న పీటర్ అనారోగ్యంతో మార్చి 27న మరణించాడు. దాంతో, ఇంగ్లండ్ మాజీ ఆటగాళ్లు సంతాపం తెలియజేస్తున్నారు. తొలితరం పేస్ బౌలర్లలో ఒకడైన పీటర్ ఇంగ్లండ్ తరఫున ఆడింది తక్కువ మ్యాచులే. కానీ, ఆడినన్ని రోజులు తన ముద్ర వేశాడీ పేస్ గన్.

దేశవాళీలో, కౌంటీల్లో లాంక్‌షైర్ జట్టుకు ఆడిన పీటర్ తన పేస్ పవర్ చూపించాడు. తన ప్రతభతో ఇంగ్లండ్ జట్టుకు ఎంపికైన అతడు 17 టెస్టులు, 10 వన్డేలు ఆడాడు. టెస్టుల్లో 36.80 సగటుతో 41 వికెట్లు కూల్చిన ఈ స్పీడ్‌స్టర్ .. రెండు ఫార్మాట్లలో కలిపి 52 వికెట్లు పడగొట్టాడు. ఇక బ్యాటుతోనూ రాణించి 350 పరుగులు సాధించాడు.

పీటర్ మృతిపట్ల విచారం వ్యక్తం చేసింది ల్యాంక్‌షైర్ క్రికెట్ క్లబ్. 1960 నుంచి 1976 మధ్యకాలంలో పీటర్ 301 ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లు ఆడాడని, 796 వికెట్లు ఖాతాలో వేసుకున్నాడని ఎక్స్ పోస్ట్‌లో తెలిపింది. పీటర్ కెరియర్‌లో 1975 సంవత్సరానికి ఓ ప్రత్యేకత ఉంది. అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ ఆ ఏడాది తొలిసారి వన్డే వరల్డ్ కప్ పోటీలు నిర్వహించింది. ఆ ప్రపంచ కప్ ఆడిన ఇంగ్లండ్ జట్టులో సభ్యుడైన పీటర్‌కు.. ఆ టోర్నీనే ఆఖరిది అయింది.

# కెప్టెన్సీపై రూట్ విముఖత..

## రేసులో ముగ్గురు కుర్రాళ్లు..!



**ఇంగ్లండ్:** ఇంగ్లండ్ క్రికెట్ బోర్డుకు కొత్త తలనొప్పి మొదలైంది. జోస్ బట్లర్ వారసుడి ఎంపికపై ప్రతిష్టంభన నెలకొంది. వైట్ బాల్ కెప్టెన్ పదవిపై పలువురు సీనియర్లు విముఖత వ్యక్తం చేస్తున్నారు. తాజాగా జో రూటా జాతీయ జట్టు పగ్గాలు చేపట్టేందుకు తాను సిద్ధంగా లేనని వెల్లడించాడు.

'ఇంగ్లండ్‌కు టెస్టుల్లో సారథిగా వ్యవహరించాను. ఇక మళ్లీ కెప్టెన్సీ చేయాలనే ఉద్దేశం నాకు లేదు. ముఖ్యంగా వన్డే, టీ20 జట్లకు అస్సలు నాయకుడిగా ఉండాలని అనుకోవడం లేదు. అయితే.. కొత్త కెప్టెన్ ఎవరు అయినా సరే వాళ్లు నిజంగా గర్వపడతారు' అని రూట్ తెలిపాడు. దాంతో.. ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు దిక్కుతోచని స్థితిలో పడిపోయింది.

### వరుస వైఫల్యాలతో..

ఇయాన్ మోర్గాన్ నుంచి 2022లో కెప్టెన్సీ అందుకున్న జోస్ బట్లర్ తన మార్క్ చూపలేకపోయాడు. వన్డే వరల్డ్ కప్‌లో ఓటమి.. ఈమధ్యే ఛాంపియన్స్ ట్రోఫీలోనూ అతడి నాయకత్వంలోని ఇంగ్లండ్ జట్టు ఘోరంగా విఫలమైంది. ఈ టోర్నీలో వైఫల్యం తర్వాత జోస్ బట్లర్ కెప్టెన్‌గా తప్పుకున్నాడు. దాంతో, వైట్ బాల్ సారథిగా సమర్థుడైన ఆటగాడిని నియమించాలని ఈసీబీ భావిస్తోంది.

ప్రస్తుతానికి డాషింగ్ ఓపెనర్ బెన్ డకెట్, ఆల్‌రౌండర్ లియాం లివింగ్‌స్టోన్‌లు కెప్టెన్సీ చేపట్టేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. వీళ్లలో ఒకరిని ఎంపిక చేస్తారా లేదంటే టెస్టులు, టీ20ల్లో ఇరగదీస్తున్న హ్యారీ బ్రూక్‌కు బాధ్యతలు అప్పగిస్తారా? అనేది త్వరలోనే తెలియనుంది. ప్రస్తుతం ఇంగ్లీష్ జట్టుకు మూడు ఫార్మాట్ల కోచ్‌గా సేవలందిస్తున్న బ్రెండన్ మెక్‌కల్లమ్‌తో చర్చించి.. సెలెక్టర్లు కొత్త సారథిని ప్రకటిస్తారని సమాచారం.

# బ్లేజర్‌లో ఫారియా అబ్దుల్లా క్లీవేజ్ షో

టాకీస్: జాతిరత్నాలు మూవీతో టాలీవుడ్ ఆడియన్స్ ను ఎట్రాక్ట్ చేసిన ఫారియా అబ్దుల్లా నటిగా మంచి మార్కులే కొట్టేసింది. 'చిట్టి నీ నవ్వంటే లక్ష్మీ పటాసే.. ఫట్టుమని పేలిందా గుండే ఖల్లాసే..' అంటున్నారు నెటిజెన్లు. ఫరియా అబ్దుల్లా ఫొటో షూట్లతో హీట్ పుట్టిస్తోంది. ఆమె ఫ్యాషన్ షోకు ఫిదా అవుతున్నారు. లైక్ లు కామెంట్లతో ఇన్ స్టాలో అభిమానాన్ని చాటుతున్నారు. నిమాలు తక్కువైనా, ఫొటోషూట్లతో మాత్రం సోషల్ మీడియాలో హీట్ పెంచుతోంది. తాజాగా ఆమె షేర్ చేసిన లేటెస్ట్ లుక్ అందర్నీ మైమరపిస్తోంది. తెల్లటి బ్లేజర్ సూట్లో స్టన్నింగ్ గా మెరిసి పోయింది ఫరియా. క్లాసిక్ వైట్ ప్యాంట్ సూట్ కంపోసిషన్ కు బ్రైటు గోల్డ్ జ్యువెలరీ కాంబినేషన్ ఏ లెవల్లో ఉ ంటుందో ఈ ఫొటోలు ప్రూవ్ చేశాయి. మెటాలిక్ బ్రేస్లెట్స్, లేయర్డ్ నెక్ పీస్, నోస్ రింగ్ వంటి ఆభరణాలు ఆమె లుక్కుని మరింత అందంగా మార్చేశాయి. ఈ కాంప్లిమెంటరీ లుక్ లో ఫారియా తన గ్లామర్ తో పాటు తన స్టైల్ ఓరియెంటే షన్ ను కూడా చూపించగలి గింది. ఆమె ధరిస్తున్న డ్రెస్, జ్యువెలరీ, స్టైలింగ్ అన్నీ కలిసే ఒక ఆర్ట్ వర్క్ ఫీలయ్యేలా ఉన్నాయి. ఫరియా ప్రస్తుతం కొన్ని సినిమాలు, వెబ్ ప్రాజెక్ట్స్ లో భాగంగా బిజీగా ఉంది.





## వెంకటేశ్‌తో హరీశంకర్ సినిమా





**టాకీస్:** ఇటీవల విడుదలైన 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాతో బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని సాధించాడు టాలీవుడ్ స్టార్ హీరో విక్టరీ వెంకటేష్. దర్శకుడు అనిల్ రావిపూడి రూపొందించిన ఈ చిత్రం పూర్తి కామెడీ ఎంటర్‌టైనర్‌గా ప్రేక్షకులను ఆకర్షించడంలో విజయవంతమైంది. ఈ సినిమా ద్వారా వెంకటేష్ తన కెరీర్‌లో అతిపెద్ద బ్లాక్‌బస్టర్‌ను తన ఖాతాలో వేసుకున్నాడు. దాదాపు రూ.300 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టాడు. అయితే ఈ సినిమా విజయంతో ఉత్సాహంగా ఉన్న ఈ స్టార్ హీరో, తన తదుపరి చిత్రాన్ని సిద్ధం చేసే పనిలో నిమగ్నమైనట్లు తెలుస్తోంది. ప్రస్తుతం వెంకటేష్ వివిధ దర్శకుల నుంచి కథలు వినడంలో బిజీగా ఉన్నాడని సమాచారం. ఈ సందర్భంలోనే ప్రముఖ దర్శకుడు హరీష్ శంకర్ కూడా ఓ కథను వెంకటేష్‌కు వినిపించినట్లు తెలుస్తోంది. ఈ కథ వెంకీకి నచ్చడమే కాకుండా, నిర్మాత సురేష్ బాబు కూడా దీన్ని ఆమోదించినట్లు వార్తలు వస్తున్నాయి. సినీ వర్గాల్లో ఈ ప్రాజెక్ట్‌ను వెంకటేష్ ఖరారు చేసినట్లు చర్చలు జరుగుతున్నాయి. ఈ చిత్రం వెంకటేష్ కెరీర్‌లో 77వ సినిమాగా రానున్నట్లు సమాచారం. త్వరలోనే ఈ సినిమాను అధికారికంగా ప్రకటించే అవకాశం ఉందని సినీ సర్కిల్స్‌లో టాక్ నడుస్తోంది.

## పూరీ జగన్నాథ్‌ను రిజెక్ట్ చేసిన హీరోయిన్

### ఆ తర్వాత సినిమాల కోసం ఎదురుచూపులు



టాకీస్: టాలీవుడ్ ఇండస్ట్రీలో డేరింగ్ అండ్ డాషింగ్ డైరెక్టర్ అంటే ఠక్కున గుర్తొచ్చే పేరు పూరి జగన్నాథ్. పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటించిన బద్రి సినిమాతో సినీరంగంలోకి అడుగుపెట్టారు. 2006లో మహేష్ బాబు నటించిన పోకిరి సినిమాతో బాక్సాఫఈస్ వద్ద సంచలనం సృష్టించారు. తెలుగులో ఎన్నో సూపర్ హిట్ చిత్రాలను రూపొందించి.. హీరోయిజం అంటే సరికొత్త అర్థం చెప్పారు. పూరి సినిమాలకు యూత్ లో మంచి క్రేజ్ ఉంటుంది. పూరి జగన్నాథ్ సినిమాల కోసం అభిమానులు, యూత్ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తుంటారు. అలాంటి టాప్ డైరెక్టర్ సినిమాలో అవకాశం వస్తే నటించాలని ఎంతో మంది ఆర్టిస్టుల కల. కానీ ఓ హీరోయిన్ మాత్రం పూరి జగన్నాథ్ సినిమా నుంచి ఆఫర్ రిజెక్ట్ చేసిందట. మోడలింగ్ రోజుల్లో ఇండస్ట్రీ గురించి ఏమి తెలియదని.. అప్పుడే పూరి జగన్నాథ్ సినిమాలో ఛాన్స్ వచ్చిందని కానీ ఆ ప్రాజెక్ట్ చేయడానికి ఒప్పుకోలేదని చెప్పుకొచ్చింది. ఇంతకీ ఆమె ఎవరో తెలుసా.. తనే హీరోయిన్ రకుల్ ప్రీత్ సింగ్. తెలుగు చిత్రపరిశ్రమలో ఒకప్పుడు టామ్ హీరోయిన్ ఆమె. స్టార్ హీరోల సరసన ఎన్నో సూపర్ హిట్ చిత్రాల్లో నటించి తనకంటూ మంచి గుర్తింపు తెచ్చుకుంది. పెళ్లి తర్వాత సైతం కెరీర్ లో రాణిస్తుంది రకుల్. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న రకుల్.. కెరీర్ ఆరంభం, పెళ్లి గురించి ఆసక్తికర విషయాలను పంచుకుంది. కాలేజీలో చదువుకుంటున్న రోజుల్లోనే మోడలింగ్ చేశానని.. ఆ సమయంలో తన ఫోటోస్ చూసి కన్నడ సినిమా నుంచి ఆఫర్ వచ్చిందని.. అప్పట్లో తనకు సౌత్ ఇండస్ట్రీ గురించి అంతగా తెలియదని చెప్పుకొచ్చింది. ఆ సినిమా వాళ్లు తన తండ్రికి ఫోన్ చేసి మాట్లాడటంతో గిల్లి సినిమాలో నటించానని.. సినిమా షూటింగ్ వల్ల చదువులో సమస్యలు వచ్చాయని.. ఫస్ట్ మూవీతోనే నటనకు మంచి గుర్తింపు వచ్చిందని చెప్పుకొచ్చింది. ఆ తర్వాత తనకు పూరి జగన్నాథ్ నుంచి కాల్ వచ్చిందని.. దాదాపు 70 రోజులు డేట్స్ అడిగారని.. అందుకు తాను అంగీకరించలేదని తెలిపింది.



## కొత్త లుక్స్‌తో హల్‌చల్ చేస్తున్న అనన్యపాండే

**టాకీస్:** బాలీవుడ్ బ్యూటీ అనన్య పాండే టాలీవుడ్ ప్రేక్షకులకు కూడా సుపరిచితురాలే. ఈ ముద్దుగుమ్మ 1998 అక్టోబర్ 30న ముంబైలో జన్మించింది. ఆమె తండ్రి చంకీ పాండే కూడా బాలీవుడ్‌లో ప్రముఖ నటుడు, తల్లి భావనా పాండే ఒక కాస్ట్యూమ్ డిజైనర్. అనన్య 2019లో "స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్ 2" చిత్రంతో సినీ రంగంలోకి అడుగు పెట్టింది. ఈ సినిమాలో ఆమె నటనకు ఫిల్మ్‌ఫేర్ అవార్డు ఫర్ బెస్ట్ ఫీమేల్ డెబ్యూ కూడా లభించింది. ఆతర్వాత వరుసగా సినిమాలు చేసి ప్రేక్షకులను ఆకట్టుకుంది ఈ చిన్న ది. అనన్య తన కెరీర్‌లో పతి పత్నీ ఔర్ వో, లైగర్, డ్రీమ్ గర్ల్ 2 వంటి చిత్రాల్లో నటించింది. లైగర్ ఈ బ్యూటీ తొలి తెలుగు చిత్రం. ఈ సినిమాలో విజయ్ దేవరకొండ సరసన ఆమె నటించింది, కానీ ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద విజయం సాధించలేదు. ఆ తర్వాత ఈ భామ ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లపై దృష్టి సారించింది. ఆమె సోషల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉంటుంది.

## క్రేజీ కాంబో.. విజయదేరవకొండతో కీర్తిసురేష్ సినిమా





టాకీస్: 'మహానటి'తో జాతీయ ఉత్తమ నటి అవార్డు అందుకున్న కీర్తి సురేష్ ఈ మధ్య తెలుగులో కనిపించడం లేదు. గతేడాది వివాహం బంధంలోకి అడుగుపెట్టిన ఈ బ్యూటీ 'బేబీ జాన్'తో బాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చింది. గతంలో హెూమ్లీగా కనిపించే ఈ ముద్దుగుమ్మ బాలీవుడ్‌లోకి వెళ్లగానే తనలోని మరో కోణాన్ని బయటపెట్టింది. బేబీ జాన్‌తో ఆమె గ్లామర్‌కి నార్త్ జనాలు ఫిదా అయిపోయారు. దీంతో సినిమా డిజాస్టర్ అయినా కీర్తి మాత్రం మంచి మార్కులే కొట్టేసింది. పెళ్లి తర్వాత దూకుడి పెంచిన కీర్తి మళ్లీ టాలీవుడ్‌పై ఫోకస్ పెట్టింది. దీంతో ఆమెకు వరుస ఆఫర్లు వెల్లువెత్తుతున్నాయి. నితిన్, వేణు యెల్దండి కాంబినేషన్లో దిల్ రాజు నిర్మిస్తోన్న 'ఎల్లమ్మ'లో కీర్తి సురేష్ నటిస్తోందంటూ వార్తలొస్తున్నాయి. ఈ క్యారెక్టర్ కోసం ముందుగా సాయిపల్లవిని అడిగితే డేట్స్ అడ్జస్ట్ లేక నో చెప్పేసిందట. దీంతో ఆమె ఆఫర్ కీర్తి వద్దకు చేరినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. దీనిపై యూనిట్ నుంచి ఎలాంటి సమాచారం లేదు. తాజాగా ఈ భామ రౌడీ స్టార్ విజయ్ దేవరకొండ పక్కన ఛాన్స్ కొట్టేసింది. ప్రస్తుతం విజయ్ దేవరకొండ 'కింగ్‌డమ్' అనే సినిమాలో నటిస్తున్నాడు. దీని తర్వాత 'రాజావారు రాణిగారు' ఫేమ్ రవికిరణ్ కోలా దర్శకత్వంలో 'రౌడీ జనార్ధన్' మూవీ చేయనున్నాడు. దీనికి దిల్ రాజు నిర్మాత. ఈ ప్రాజెక్టులో కీర్తి సురేష్‌ని తీసుకుంటే కాంబినేషన్ అదిరిపోతుందని మేకర్స్ భావిస్తున్నారట. ఇక సుహాస్ పక్కన 'ఉ ప్పు కప్పురంబు' మూవీ ఇప్పటికే కన్ఫామ్ అయిన సంగతి తెలిసిందే. జాతీయ ఉ త్తమ నటిగా అవార్డు అందుకుని 'మహానటి'గా కీర్తించబడుతోన్న కీర్తి సురేష్ ఇకపై కమర్షియల్ బాటలో నడుస్తూ గ్లామర్ హీరోయిన్‌గా పేరు తెచ్చుకోవాలని తెగ ఆరాటపడుతోందట. చాలామంది హీరోయిన్లు కెరీర్ తొలినాళ్లలో గ్లామర్ పాత్రలు చేసి పెళ్లి తర్వాత హెూమ్లీగా కనిపించడానికి ప్రయత్నిస్తారు. కీర్తి మాత్రం ఇన్నాళ్లు కాస్త పద్ధతిగా కనిపించి పెళ్లి తర్వాత గ్లామర్ ట్రీట్ ఇవ్వడానికి తెగ కష్టపడుతోంది. బాలీవుడ్‌కి వెళ్లిన తర్వాత తత్వం బోధపడి ఇలాంటి నిర్ణయం తీసుకుని ఉండొచ్చని ఫాన్స్ అనుకుంటున్నారు. ప్రస్తుతం టాలీవుడ్‌లో వరుస ప్రాజెక్టులను లైన్లో పెడుతోన్న కీర్తికి ఒకట్రెండు హిట్లు పడ్డాయంటే ఇప్పట్లో ఆమె కెరీర్‌కు ఢోకా ఉండదు. ఇక బాలీవుడ్‌లో 'బేబీ జాన్' తర్వాత రాకింగ్ స్టార్ రణబీర్ కపూర్ పక్కన కీర్తి ఛాన్స్ కొట్టేసినట్లు ప్రచారం జరుగుతోంది. రొమాంటిక్ లవ్ స్టోరీగా తెరకెక్కే ఈ మూవీలో కీర్తి సురేష్ గ్లామర్ షోకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చేసిందట. అయితే ప్రస్తుతం రామాయణ, లవ్ అండ్ వార్‌బీ యానిమల్ పార్క్ వంటి చిత్రాలతో రణబీర్ బిజీగా ఉండటంతో ఈ ప్రాజెక్టు ఎప్పుడు పట్టాలెక్కుతుందో క్లారిటీ లేదు.

## రూ.700 కోట్ల బడ్జెట్‌తో హృతిక్‌రోషన్ సినిమా



టాకీస్: బాలీవుడ్ స్టార్ నటుడు హృతిక్ రోషన్ మెగాఫోన్ పడుతున్నాడు. ఈ విషయాన్ని అతడి తండ్రి రాకేష్ రోషన్ ఎక్స్ వేదికగా పంచుకున్నాడు. హృతిక్ రోషన్ హీరోగా నటించిన సూపర్ హీరో చిత్రం క్రిష్ ఎంత పెద్ద హిట్టయిందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. అప్పటివరకు హాలీవుడ్ సూపర్ హీరోలు మాత్రమే తెలిసిన ప్రేక్షకులకు ఇండియన్ సూపర్ హీరోగా హృతిక్ రోషన్ అలరించాడు. కోయి మిల్ గయా, క్రిష్, క్రిష్ 3 సినిమాలు రాగా బ్లాక్ బస్టర్ అందుకున్నాయి. ఇప్పుడు ఇదే ఫ్రాంచైజీ నుంచి క్రిష్ 4 రాబోతుంది. మొదటి మూడు పార్టులకు హృతిక్ రోషన్ తండ్రి రాకేష్ రోషన్ దర్శకత్వం వహించగా.. తాజాగా వచ్చే క్రిష్ 4తో హృతిక్ మెగాఫోన్ పట్టబోతున్నాడు. ఈ విషయాన్ని తెలుపుతూ.. హృతిక్ తండ్రి రాకేష్ రోషన్ ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టాడు. దుగ్గూ (హృతిక్ రోషన్) 25 సంవత్సరాల క్రితం నిన్ను నటుడిగా పరిచయం చేశాను. ఇప్పుడు 25 ఏళ్ల తర్వాత ఆదిత్య చోప్రా నేను కలిసి దర్శకుడిగా ఇండస్ట్రీకి పరిచయం చేయబోతున్నాం. దర్శకుడిగా నీ ప్రయాణంలో నువ్వు అనేక విజయాలు సాధించాలని ఆశిస్తున్నాను. మా ప్రతిష్టాత్మక చిత్రం 'క్రిష్ 4'కి నీవు దర్శకత్వం వహిస్తుండటం సంతోషంగా ఉందంటూ రాకేష్ రోషన్ రాసుకొచ్చాడు. ఈ విషయం తెలిసిన బాలీవుడ్ ప్రముఖులు హృతిక్‌కి శు భాకాంక్షలు తెలుపుతున్నారు. మరోవైపు ఈ ప్రాజెక్ట్ రూ.700 కోట్ల భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్నట్లు సమాచారం.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.